జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 8 | హైదరాబాద్, అక్టోబరు 27 మంగళవారం 2020 | 8 పేజీలు | వెల : 5.00

# డబుల్ బెడ్ రూం ఇళ్లు ప్రారంభం

## జియాగూడలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించిన కేటీఆర్



హైదరాబాద్,అక్టోబరు 26ప్రజాపాలన : జియగూడలోని అంబేడ్కర్ నగర్‌లో నిర్మించిన 840 డబుల్ బెడ్‌రూం ఇండ్లను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అక్కడ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్తీ దవఖానాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహముద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మహంతితో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అని పెద్దలు సామెత చెబుతుంటారు. ఈ రెండు పనులు చేయడమంటే కష్టంతో కూడుకున్న పని. కానీ ఇల్లు నేనే కట్టిస్తా.. పెళ్లి నేనే చేస్తా అని అన్నది సీఎం కేసీఆర్ మాత్రమే అని స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా నిరుపేద ఆడపిల్లల వివాహాలకు లక్షా నూట పదహారు రూపాయాలు అందిస్తున్నామని తెలిపారు. పేదవారికి ఒక మేనమామల కేసీఆర్ ఉన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా.. బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం డబుల్ బెడ్ రూం ఇండ్లను కట్టించి ఇస్తున్నామని తెలిపారు. పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాలు జరుపుకుంటున్నాం. నగరం మొత్తంలో లక్ష డబుల్ బెడ్‌రూంలు సిద్ధంగా ఉన్నాయి. ఇవాళ జియగడా, గోడె కి కబర్, కట్టెలమండిలో కలిసి 1152 ఇండ్లు పేదవారికి అందజేస్తున్నామని చెప్పారు. నగరంలోని నిరుపేదలకు దశల వారీగా ఇండ్లను అందజేస్తాం. 1985లో ఎన్టీ రామారావు హయాంలో బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమం ప్రారంభమైంది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఇచ్చిన ఇండ్లు అగ్గిపెట్టె, డబ్బా ఇండ్లు. ఈ 35 ఏండ్లు ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లు 45 లక్షలు మాత్రమే. ఒక వేళ వారు ఇండ్లు ఇస్తే రాష్ట్రంలో పేదోడు ఉండొద్దు. ఏడేండ్ల కింద పరకాల నియోజకవర్గంలో వరికోలు గ్రామానికి వెళ్లాను. 550 ఇండ్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని చెప్పారు. కానీ అక్కడ ఐదు ఇండ్లు కూడా లేవు. ఇల్లు కట్టకుండానే కట్టినట్లు చూపించి డబ్బులు దండుకున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా రూ. 40 లక్షల నుంచి రూ. 50 లక్షల విలువ చేసే ఇండ్లను కట్టించి ఇస్తుందన్నారు. ఇండ్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు ఎవరూ జోక్యం చేసుకోరు.

(మిగతా 2వ పేజీలో..)

## కోటి రూపాయలతో దుర్గాదేవి విగ్రహానికి అలంకరణ



హైదరాబాద్,అక్టోబరు 26 ప్రజాపాలన:దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గద్వాల్‌లోని కన్యకావరవేంశ్వరి ఆలయంలో అమ్మవారిని కోటి రూపాయల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. నోట్లను పువ్వుల్లా తయారుచేసి అమ్మవారిని వాటితో అద్భుతంగా అలంకరించారు. కరోనా వైరస్ కారణంగా ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిన వేళ ఇలా కోటి రూపాయలతో అమ్మవారిని దుర్గాదేవిలా అలంకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అలంకరణ కోసం వివిధ రంగుల్లో ఉన్న నోట్లను ఎంచుకున్నారు. ఆ నోట్ల మొత్తం విలువ రూ. 1,11,11,111. గతేడాది అమ్మవారిని రూ. 3,33,33,333 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించినట్టు ఆలయ కోశాధికారి పి.రాము తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం కారణంగా గతేడాదితో పోలిస్తే ఈసారి ఆ మొత్తం తగ్గిందని పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీకి చెందిన 40-50 మంది భక్తులు ఇచ్చిన నోట్లతో వీటిని అలంకరించామని, పూజల అనంతరం వాటిని తిరిగి వారికి అప్పగిస్తామని వివరించారు.

# 'సీఎం ఆశీస్సులతో దుబ్బాకను అభివృద్ధి చేస్తా'

## అలాయ్ - బలాయ్ కార్యక్రమంలో హరీష్ రావు



సిద్దిపేట,అక్టోబరు 26 ప్రజాపాలన:దుబ్బాక ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించిన అలాయ్ - బలాయ్ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కేవలం ఓట్ల కోసం మాత్రమే వస్తున్నారని తెలిపారు. ఉత్తమ్ మంత్రిగా ఉన్న సమయంలో దుబ్బాకకు ఒక్కసారి కూడా రాలేదు. కానీ ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నాడు. హుజుర్‌నగర్‌లో టీఆర్ఎస్ పార్టీ గెలిచిన తర్వాత.. సీఎం కేసీఆర్ నేరుగా ఆ నియోజకవర్గానికి వెళ్లి రూ. 300 కోట్ల పనులు మంజూరు చేశారని హరీష్ రావు గుర్తు చేశారు.రేపు అదే రీతిలో దుబ్బాకకు నిధులిచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. దుబ్బాక అభివృద్ధి బాధ్యత తనదే అని హరీష్ రావు స్పష్టం చేశారు. ఇందులో అనుమానమే అవసరం లేదన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో దుబ్బాకను అభివృద్ధి చేస్తానని తేల్చిచెప్పారు. సీఎం ఆశీస్సులతో నారాయణఖేడ్‌ను కూడా అభివృద్ధి చేశానని చెప్పారు. ఎన్నికల వరకే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు దుబ్బాకలో ఉంటారు. కానీ తాను, సుజాతక్క ఎల్లప్పుడూ దుబ్బాకలోనే ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. దుబ్బాకలో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను తప్పకుండా ఏర్పాటు చేస్తామని హరీష్ రావు హామీనిచ్చారు.

# పవన్‌కల్యాణ్ ప్రచారంపై స్పష్టత లేదు:కిషన్‌రెడ్డి



హైదరాబాద్,అక్టోబరు 26 ప్రజాపాలన: డబుల్ బెడ్రూం ఇళ్ళు ఎంత ఎక్కువ పంపిణీ చేస్తే బీజేపీకి అంత లాభమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇళ్ళు వచ్చిన వారి కంటే రాని వారికే ఎక్కువ కడుపు మంటన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ళ అంశం ప్రాతిపదికనే జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్ళు, కరోనా, వరదలు.. అన్నింట్లో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణ వచ్చాకే రాష్ట్రంలో నిరంతర విద్యుత్ వెలుగులు:ఎర్రబెల్లి



మహబూబాబాద్,అక్టోబరు 26 ప్రజాపాలన: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే రాష్ట్రంలో నిరంతర విద్యుత్ వెలుగులు వచ్చాయని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలతో రాష్ట్రంలో విద్యుత్‌కోతలు లేకుండా చేశారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు తీవ్ర కరెంట్‌కోతలు ఎదుర్కొన్నారని, కానీ ప్రస్తుతం రైతులకు విద్యుత్ కష్టాలు లేవని అన్నారు. పరిశ్రమలకు కూడా విద్యుత్‌కోతలు లేవని గుర్తుచేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టంను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో తప్ప 24 గంటలు నిరంతర విద్యుత్‌ను అందిస్తున్న రాష్ట్రం దేశంలో లేదని చెప్పారు. తొర్రూరు మున్సిపాలిటీని మరింత వేగంగా అభివృద్ధి చేసుకుందామన్నారు.

## నిమ్స్‌లో ప్రారంభంకానున్న మూడోదశ భారత్ బయోటెక్ కోవ్యాక్సిన్




హైదరాబాద్,అక్టోబరు 26 ప్రజాపాలన: నిమ్స్ హాస్పిటల్‌లో మరో నాలుగు రోజుల్లో మూడో దశ భారత్ బయోటెక్ కోవ్యాక్సిన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఐసీఎంఆర్ నుంచి అనుమతులు రావడంతో మూడో దశ పరీక్షలు జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రేపు నిమ్స్ ఎథిక్స్ కమిటీ సమావేశం జరుగనుంది. దాదాపుగా 100 నుండి 200 మందికి వ్యాక్సినేషన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేపట్టారు. డిసెంబర్ చివరినాటికి మూడో దశ పూర్తి అవుతుందని అధికారులు అంటున్నారు. ఫిబ్రవరి చివరి నాటికి తుది అనుమతులు పొంది వ్యాక్సిన్ మార్కెట్లోకి వచ్చే ఆస్కారం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

# భారత్ చేరుకున్న అమెరికా విదేశాంగ కార్యదర్శి



న్యూఢిల్లీ,అక్టోబరు 26 ప్రజాపాలన: 2 ప్లస్ 2 సంభాషణల నిమిత్తం అమెరికా విదేశాంగ కార్యదర్శి మైక్ పాంపియో, రక్షణ కార్యదర్శి మార్క్ ఎస్పెర్ సోమవారం మధ్యాహ్నం న్యూఢిల్లీ చేరుకున్నారు. మైక్ పాంపియో వెంట ఆయన భార్య సుసాన్ కూడా ఉన్నారు. వీరికి న్యూఢిల్లీలో దౌత్య అధికారులు ఘన స్వాగతం పలికారు. చర్చలు మంగళవారం జరుగనున్నాయి. రెండు రోజుల పర్యటన సందర్భంగా వీరు కేంద్ర మంత్రి జైశంకర్, రాజ్‌నాథ్‌సింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపి.. ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశం కానున్నారు.అమెరికా అధ్యక్ష ఎన్నికలకు వారం రోజుల ముందుగా వీరి పర్యటన జరుగడం ప్రాధాన్యతనిస్తున్నది. మైక్ పాంపియో, మార్క్ ఎస్పెర్ తమ పర్యటనలో శ్రీలంక, మాల్దీవులు, ఇండోనేషియాలను కూడా సందర్శించనున్నారు. ఈ ప్రాంతాల్లో చైనా యొక్క విస్తరణవాద నమూనాల నేపథ్యంలో వీరి పర్యటన ప్రాముఖ్యతను సంతరించుకున్నది. (మిగతా 2వ పేజీలో..)



## డబుల్ బెడ్ రూం ఇళ్లు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఏ ఒక్కరికీ కూడా ఒక్క పైసా కూడా లంచం ఇవ్వొద్దు. కేవలం అధికారులు మాత్రమే పారదర్శకంగా ఇండ్ల పంపిణీ చేస్తారని తెలిపారు. అంబేద్కర్ నగర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. లైబ్రరీ కూడా అవసరం కాబట్టి అది కూడా తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 75 వేల పైచిలుకు ఇండ్లు కడుతున్నాం. 18 వేల కోట్ల రూపాయాలు ఖర్చు పెడుతున్నాం. ఈ ఇండ్ల మార్కెట్ విలువ రూ. 70 వేల కోట్లు ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ఆలస్యమైనా పర్వా లేదు కానీ.. నాణ్యతలో లోపం లేకుండా ఇండ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలో మూసీ సుందరీకరణ పనులు చేపడుతామన్నారు. జియగూడ అంటే కబేళా ఫేమస్. కబేళాను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. భవిష్యత్‌లో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పూర్తయితే.. జియగూడకు కొత్త కళ వస్తుంది. సైంటిఫిక్‌గా కబేళాను నిర్మించి ఇస్తామన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రత లేకపోతే ఎన్నో రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. పారిశుధ్యం కూడా మీరే నిర్వహించుకోవాలి అని కేటీఆర్ సూచించారు.

## పవన్‌కల్యాణ్ ప్రచారంపై స్పష్టత లేదు:కిషన్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

దుబ్బాకలో బీజేపీ గెలుస్తోందనటానికి మంత్రి హరీశ్‌రావు ఫ్రస్టేషనే ఉదాహరణ అని అన్నారు. దుబ్బాకలో నిరుద్యోగులు బీజేపీకి ప్రచారం చేయటాన్ని హరీశ్ తట్టుకోలేకపోతున్నాడని, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో జనసేనతో కలిసి పోటీపై పార్టీలో చర్చ జరగలేదని తెలిపారు. దుబ్బాకలో జనసేన అధినేత పవన్ ప్రచారంపై స్పష్టత లేదని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళం ఇవ్వాలని ముఖ్యమంత్రే వ్యాపారవేత్తలకు ఫోన్లు చేస్తున్నారని విమర్శించారు. సినీ నటులను విరాళాలు ఇవ్వాలని మంత్రి తలసాని శ్రీనివాస్ అడిగనందునే.. నాయకులు సైతం విరాళాలు ఇవ్వాలని పవన్ అన్నారని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి త్వరలో విపత్తు నిధులు వస్తాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## భారత్ చేరుకున్న అమెరికా విదేశాంగ కార్యదర్శి

(మొదటి పేజీ తరువాయి)

ఇండో–పసిఫిక్ కోసం అమెరికా–భారత్ ఉచితంగా, బహిరంగంగా, అభివృద్ధి చెందుతున్నాయి. మూడవ యూఎస్–ఇండియా 2 ం 2 ద్వైపాక్షిక చర్చల సందర్భంగా భద్రతా లక్ష్యాలను పంచుకోవడానికి ఇరు దేశాలు అందించే ఉన్నత స్థాయి నిబద్ధతను ప్రదర్శిస్తున్నాయని అమెరికా విదేశాంగ శాఖ ఆదివారం తెలిపింది. రెండు దేశాలు తమ వ్యూహాత్మక, భద్రతా సంబంధాలను సమీక్షించడానికి, ద్వైపాక్షిక సంభాషణల్లో ఇండో–పసిఫిక్‌ను నిర్ధారించే మార్గాలను చర్చించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ చర్చలు ప్రాంతీయ భద్రతా సహకారం, రక్షణ సమాచార భాగస్వామ్యం, సైనిక పరస్పర చర్యలు, రక్షణ వాణిజ్యం అనే నాలుగు అంశాలపై దృష్టి సారించనున్నట్లు గత వారం యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రకటనలో తెలిపింది.మొదటి రెండు ద్వైపాక్షిక సంభాషణలు 2018 సెప్టెంబర్ నెలలో న్యూఢిల్లీలో, 2019 లో వాషింగ్టన్ డీసీలో జరిగాయి. మూడవది ప్రస్తుతం న్యూఢిల్లీలో జరుగనున్నది. రెండు రోజుల పర్యటన సందర్భంగా మైక్ పాంపియో, మార్క్ ఎస్పెర్.. తమ భారత సహచరులైన ఎస్ జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్‌లతో ద్వైపాక్షిక చర్చలు జరిపి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమవుతారు. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా చాలా దౌత్య సమావేశాలు, పరస్పర చర్యలు ఆన్‌లైన్‌లోకి మారిన సమయంలో.. పాంపియో, ఎస్పెర్ వ్యక్తిగతంగా సందర్శించడం యొక్క ప్రాముఖ్యతను ఇరువైపుల అధికారులు ఎత్తిచూపారు. ఇది భారతదేశంతో సంబంధానికి ఉన్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని చెప్పవచ్చు.

## అందరికీ ఎల్లవేళలా అమ్మవారు ఆశీస్సులు



బాలాపూర్ ప్రజాపాలన : బాలాపూర్ మండలం బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బడంగ్పేట్ గ్రామంలోని దుర్గామాత పూజలు నిర్వహించారు.శ్రీరామాంజనేయ భక్త సమాజం జీవా యూత్ బడంగ్ పేట్ వారి ఆధ్వర్యంలో దేవిశరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ 9 రోజులు వివిధ అవతారాల అలంకరణ లో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... కరోన మహమ్మారిని అంతం చేసి ప్రజలు అందరిని సుఖశాంతులతో ఉండేలా చూడలాని అమ్మవారిని వేడుకొని పూజలు చేయడం జరిగింది. మహిళలు చిన్నారులు బతుకమ్మలతో మరియు దసరా ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ నవరాత్రి ఉత్సవాలకు సహకారాన్ని అందించిన ప్రతి ఒక్కరికి శ్రీ రామాంజనేయ భక్త సమాజం కమిటి సభ్యుల తరుపున హృదయ ధన్యవాదాలు తెలిపారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి




మల్లాపూర్, అక్టోబర్ 26( ప్రజాపాలన ) : మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామంలో విద్యుత్ వైరు తగిలి ఎదులాపురం లక్ష్మి వయసు 50 సవత్సరాల మహిళ ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఆదివారం ఎస్సై రవీందర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మృతురాలు తన ఇంటి వద్ద నల్ల దగ్గర ఉన్న బల్బు కు కలెక్షన్ అయి ఉన్న కరెంటు వైరుకు అనుకోని ఉన్న జె వైరు ను తీసి వేసే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందింది. మృతురాలి బిడ్డ మారుపాక స్రవంతి 30 సం.రాల ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని మల్లాపూర్ ఎస్సై రవేందర్ తెలిపారు.

## అనంత పద్మనాభస్వామి వారికి పట్టు వస్త్రాలు అర్పించిన ఎమ్మెల్యే దంపతులు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 ( ప్రజాపాలన ) : శరన్నవ రాత్రులలో నిత్యపూజలతో భక్తులను ప్రసన్నులను చేసిన ఆది దేవత కాళికాదేవి. భక్తులు శ్రద్ధాసక్తులతో దైవ చింతనే పరమావధిగా కొంగుబంగారంగా కొలిచారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆలంపల్లిలో శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి ఆలయంలో స్వామి వారి అశ్వవాహన సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కుటుంబ సభ్యులు డాక్టర్ సబిత, వైభవ్ ఆనంద్, మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ళపల్లి మంజుల రమేష్ దంపతులు కౌన్సిలర్లు ,పుర ప్రముఖులు పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు ఎమ్మెల్యే దంపతులు సమర్పించారు. ఆలంపల్లిలోని అనంత పద్మనాభస్వామి దేవాలయంలో వేదపండితుడు అనంతగిరి పంతులు వేద మంత్రోచ్ఛారణల వేదఘోష నాదం ఆలయ ప్రాంగణం అంతా ప్రతిధ్వనించింది. ప్రత్యేక పూజా కైంకర్యాల అనంతరం అశ్వవాహన పల్లకి సేవలో శోభాయాత్రలో భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఎమ్మెల్యే పల్లకి సేవలో పాల్గొన్నారు. శోభాయాత్ర భాజాభజంత్రీలతో ఊరేగిస్తూ బోనమ్మ గుళ్ళ వరకు వెళ్ళారు. ప్రత్యేకంగా అలంకరించిన రావణదహన మూర్తికి, జంబి వృక్షానికి పూజా కైంకర్యాలు నిర్వహించిన అనంతరం రావణదహనం నిర్వహించారు. అనంతరం జంబి ఆకులను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొని శుభాభివందనాలు, కుశల పలకరింపలు చేసుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ళపల్లి మంజుల, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దంపతులు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కు బంగారం ( జంబి ఆకులు) అందించుకొని నమస్కారం, ప్రతి నమస్కారం ఛేశారు.



## శంఖుధారా పాత్ర, చక్రధారపాత్రల వితరణ




భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 26 ప్రజా పాలన :అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో అతి పురాతనమైన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం స్వామివారికి విజయదశమి సందర్భంగా ఆలయంలో పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు . ప్రతిరోజు స్వామి వారికి అభిషేకం లో ఉపయోగించే శంఖుధార, చక్రధార పాత్రలను వితరణ చేసిన కొత్తగూడెం వాస్తవ్యులు పబ్బ.పవన్ కుమార్ ధర్మపత్ని జాగృతి చేతుల తో వెండి ఆభరణాలను ఆలయ ఈవో. వేణుగోపాల గుప్తా సమక్షంలో స్వామివారికి అభిషేకం చేయుటకు ఉపయోగించే పాత్రలను వితరణ చేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానాచార్యులు ప్రతాపురం ప్రసాదాచార్యులు, యజ్ఞచార్యా స్వామి గిరిధరా చార్యులు, వెంకట లక్ష్మీ నరసింహచార్యులు ,రామారావు, అబ్బాస్ ,జంగాల. లక్ష్మణ బాబు ,కుటుంబ సభ్యులు గ్రామంలోని భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోగులను పరామర్శిస్తున్న జారే



అశ్వరావుపేట ప్రజా పాలన : నిత్యం ప్రజల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని తన వంతుగా సహాయ సహకారాలు చేస్తున్న అశ్వారావుపేట నియోజకవర్గ టీఆర్ఎస్ మాజీ ఇన్చార్జి ఆదినారాయణ. ఇటీవల ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయం తగిలి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అశ్వారావుపేట మండలంకి చెందిన నారం సుబ్బారావును ఖమ్మం హాస్పిటల్లో కలిసి పరామర్శించారు అలాగే దమ్మపేట మండలం చెందిన గొర్రెపాటి సీత వెన్నెముక సమస్య వల్ల ఖమ్మం హాస్పిటల్లో చికిత్స పొందుతుండగా పరామర్శించారు ఇటీవల ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు దమ్మపేట అశ్వారావు పేట మండలాల పర్యటనలో భాగంగా మొద్దులగూడెంలో పర్యటన చేస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి చికిత్స చేయించుకొనే స్తోమత లేదని నామా గారికి వివరించగ స్పందించిన నామ వివరాలు సేకరించమని జారే కి చెప్పగా రోగి ఇంటికి వెళ్లి పరిస్థితిని చూసి వివరాలు సేకరించి రిపోర్ట్ తీసుకుంటున్న జారే ఆయనతోపాటు గారపాటి సూర్యం ,దొడ్డ రమేష్, శ్రీనివాస్ ,కిషోర్, భరత్ లు తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల్లోనే టీపీఎన్‌డబ్ల్యూ ఒప్పందం



న్యూయార్క్, అక్టోబరు 26 ప్రజాపాలన:ట్రీటీ ఆన్ ప్రొహిబిషన్ ఆఫ్ న్యూక్లియర్ వెపన్స్ కు ఇప్పటి వరకు 50 దేశాలు ఆమోదం తెలిపినట్లు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. దీంతో వచ్చే మూడు నెలల్లోనే ఈ ఒప్పందం అమలులోకి రానుంది. ఈ అంతర్జాతీయ ఒప్పందానికి 50దేశాలు ఆమోదం తెలియజేయడం చారిత్రక మైలురాయిగా ఐరాస అభివర్ణించింది. ఈ నేపథ్యంలో ఆమోదం తెలిపిన దేశాలను ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రన్ అభినందించారు. అణుదాడులు, అణు పరీక్షల నుంచి బయటపడిన వారికి వందనం చేసిన ఆయన.. అణ్వాయుధాల నిషేధం కోసం వారి చేసిన పోరాటాన్ని ప్రశంసించారు.ఈ ఒప్పందం అమల్లోకి వస్తే అణ్వాయుధాల వాడకం వల్ల కలిగే నష్టాలు, విపత్కర పరిణామాలపై ప్రపంచాన్ని మేల్కొపడం మరింత సులభతరం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రీటీ ఆన్ ప్రొహిబిషన్ ఆఫ్ న్యూక్లియర్ వెపన్స్ ఒప్పందం అమలు చేయాలంటే ఐరాసలోకి కనీసం 50 సభ్యదేశాలు ఆమోదం తప్పనిసరి. తాజాగా హోండూరన్ దీనికి ఆమోదం తెలపడంతో అణ్వాయుధ నిషేధ ఒప్పందం అమలుకు మార్గం సుగమమైంది.దీంతో వచ్చే 90రోజుల్లోనే అంటే 22 జనవరి 2021 నుంచి అణ్వాయుధాల నిషేధం అమలులోకి వస్తుంది. కానీ, అమెరికాతో పాటు అణ్వాయుధాలు కలిగిన శక్తిమంతమైన దేశాలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటి వరకు బ్రిటన్, చైనా, ఫ్రాన్స్, రష్యాలు కూడా ఈ ఒప్పందంపై సంతకం చేయలేదు. అంతేకాదు ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని అమెరికా బలంగా వాదిస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిపై అమెరికా ప్రయోగించిన అణు బాంబుల ప్రభావం ఇప్పటికీ వెంటాడుతోంది. మానవాళికి మనుగడకు ప్రమాదకరంగా మారిన ఈ అణ్వాయుధాలపై నిషేధం విధించాలని అంతర్జాతీయంగా పౌర సంఘాలు పోరాటం సాగిస్తున్నాయి. ఆ సమయంలోనే నానాజాతి సమితి అంతరించి ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో 75 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అణ్వాయుధ నిషేధం అమలులోకి రానుంది. ఈ ఒప్పందం ప్రకారం, అణ్వాయుధాలు లేదా ఇతర అణు పేలుడు పరికరాలను అభివృద్ధి చేయడం, పరీక్షించడం, తయారు చేయడం, దిగుమతి చేయడం, నిల్వ ఉంచడం వంటివి నిషేధం. 'అణ్వాయుధాల నిర్మూలనకు అర్ధవంతమైన నిబద్ధతను సూచిస్తుంది.. ఇది ఐక్యరాజ్యసమితికి నిరాయుధీకరణ ప్రాధాన్యతగా మిగిలిపోయింది' అని గుటెర్రన్ వ్యాఖ్యానించారు. హిరోషిమా, నాగసాకిపై దారుణమైన దాడులు, అణు నిరాయుధీకరణను ఒక మూలస్తంభంగా మారిన ఐరాసకు 75 ఏళ్ల తర్వాత గొప్ప విజయం అని ఐసీఏఎన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీట్రైన్ ఫిన్ అన్నారు. ఈ ఒప్పందాన్ని ఆమోదించిన 50 దేశాలు అణ్వాయుధాలు కేవలం అనైతికమైనవి కావు.. చట్టవిరుద్ధం అనే కొత్త అంతర్జాతీయ నిబంధనను రూపొందించడంలో నిజమైన నాయకత్వాన్ని చూపుతున్నాయని వ్యాఖ్యానించారు

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి:ఎల్. రమణ



సారంగాపూర్, అక్టోబర్ 26 (ప్రజపాలన): సారంగాపూర్ మండలం నాగునూర్ లచక్కపెట్ గ్రామాలను తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ సందర్శించారు. దోమపోటు సన్నారకం వడ్లకు జరిగిన నష్టం ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి రైతులకు ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్నీ ఆదుకోని నష్టపరిహారం చెల్లించాలని ఎల్. రమణ ప్రభుత్వన్నీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు యాదగౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి రాజన్న ఎస్సి సెల్ అధ్యక్షుడు రేంజర్ల వినోద్ కుమార్ వొల్లాల గంగాధర్ వనామాల నిరంజన్ యేలేటి సురేందర్ రెడ్డి ఆనంతుల గంగారెడ్డి పులి మల్లేశం గౌడ్ కుడిక్యాల సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించిన దసరా పండుగ వేడుకలు



మర్పల్లి: అక్టోబర్ 25 ప్రజాపాలన : దసరా పండుగ వేడుకలు నిర్వహించేందుకు ఆదివారం సాయంత్రం 6 గంటలకు జమ్మి చెట్టుకు సంబంధిత గ్రామ సర్పంచ్ ఉమా రాణి గోపాల్ రెడ్డి పూజా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దాపూర్ గ్రామంలో ఏకతాటిపై దసరా పండుగను నిర్వహించామని కుటుంబాలకు చాటింపు ద్వారా తెలియజేశారు . ఈ క్రమంలో ఇరువర్గాల విభేదాలు ఉన్నప్పటికీ దసరా పండుగ కార్యక్రమం గ్రామ ప్రజలు పక్షమున ఏకతాటిపై పండుగను నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్ గోపాల్ రెడ్డి జమ్మి చెట్టుకు పూజలు చేసి గ్రామస్తులంతా సుఖ సంతోషాలతో ఉండేందుకు. శుభాభి వందనాలు తెలుపుతూ కృషి చేశారు . ఈ కార్యక్రమంలో. సర్పంచ్ ఉమారాణి గోపాల్ రెడ్డి. పోలీస్ సిబ్బంది. సొసైటీ బ్యాంకు డైరెక్టర్ యాదయ్య మైనార్టీ సెల్ అధ్యక్షులు అలీ మోదిన్ . వార్డ్ మెంబర్. జ్యోతి వెంకట్ రెడ్డి. దేవయ్య . పార్టీ నాయకులు. శ్రీనివాస్ రెడ్డి గొల్ల జర్నీ అయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం



మర్పల్లి ప్రజాపాలన: అక్టోబర్ 26 ప్రజా పాలన – దసరా పండుగ వేడుకలకు రావణుని కాల్చి చేసినందుకే రాముని కాల్చి చేసిన మని గ్రామానికి చెందిన దళితులు వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో దసరా పండగ రోజు ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది ఈ గ్రామంలో పోలీస్ సిబ్బంది రావణునికి కాల్చడానికి సహకరించడంతో దళిత సంఘాలు రాముని కాల్చివేశారు ఇందులో భాగంగా దసరా పండుగ రెండు భాగాలుగా విభిన్నం చోటు చేసుకుంది అంబేద్కర్ యువజన సంఘ నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిపోయిన పండుగలు విభేదాలు చోటు చేసుకున్న గాని పండుగ కోసం రావణాసురుని అంటి పెట్టొద్దు అని తీర్మానం అందరి సమక్షంలో యువజన సంఘాలు ఒప్పందం చేసుకున్నాయి ఈ సంవత్సరం రావణాసురుని తగలబెట్టడం ఎంత వరకు సమంజసమని సంఘాలు ప్రశ్నించి ముని కాల్చివేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వరుణుడు వరదై ముంచేస్తే కెసిఆర్ వెలుగై ఎదురొచ్చే



**బాలాపూర్, ప్రజాపాలన :** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కో ఆప్షన్ నెంబర్ జటావత్ రవి నాయక్ స్థానిక కార్పొరేటర్ భీమ్ రాజ్ ఆధ్వర్యంలో ముంపు ప్రాంతాల్లో మన రాష్ట్ర ప్రభుత్వం తరపున మన ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రా రెడ్డి గారి చొరవతో బారి వర్షాల కారణంగా నీట మునిగిన లోతట్టు ప్రాంతాలలోని మీర్పేట్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్ లోని బస్తీలలో ప్రశాంత్ నగర్, మురళీ కృష్ణ నగర్, 33వ 34వ ,13వ 35వ వార్డులలో వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబానికి పదివేల రూపాయలను 10000 మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇవ్వడం జరిగింది. తీసుకున్న ప్రతి ఒక్క కుటుంబం వారు వారి తరపున మన సీఎం కేసీఆర్ గారికి మరియు మన మంత్రి సబితమ్మ గారికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపాలిటీ కార్పొరేషన్ కార్పొరేటర్ వేముల నరసింహ,ఇంద్రా వత్ రవినాయక్ , కో ఆప్షన్ సభ్యురాలు వేముల ఎల్లమ్మ, కో ఆప్షన్ సభ్యుడు జటావత్ రవి నాయక్, టిఆర్ఎస్ కాంటెస్ట్ కార్పొరేటర్ మాదారి శ్రీనివాస్ మరియు స్థానిక కార్పొరేటర్ పాల్గొన వరదల వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అధికారులు మరియు స్థానిక కార్పొరేటర్ల చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది.

### పోలీసుల తీరుపై రఘునందన్ రావు తీవ్ర అసహనం

దుబ్బాక: దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తమ బంధువులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఏ ఆధారాలతో తనిఖీ చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులు ఏం చేయాలనుకుంటున్నారని నిలదీశారు. టీఆర్ఎస్ ఓటమి భయంతో నీచరాజకీయాలు చేస్తోందని రఘునందన్‌రావు మండిపడ్డారు. రఘునందన్ రావు ఇళ్లలో, కార్యాలయాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. సిద్దిపేటలో రఘునందన్‌రావు అత్తారిల్లు, బంధువుల ఇళ్లలో సోదాలు జరిపారు. మొత్తం 8 చోట్ల ఏకకాలంలో తనిఖీలు చేశారు. తనిఖీల విషయం తెలుసుకున్న ఆయన దుబ్బాకలో తన ప్రచారాన్ని మధ్యలోనే నిలిపివేశారు. అక్కడి నుంచి ఆయన సిద్దిపేటలోని తన అత్తారింటికి చేరుకున్నారు.

# ముమ్మరంగా పట్టభద్రుల నమోదు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

### ఎమ్మెల్సీ ఎలక్షన్ లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి. సీఎల్పీ నేత భట్టివిక్రమార్క

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 26 ప్రజా పాలన :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాణావత్ భీముడు మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల పై సీఎం కేసీఆర్, వ్యవసాయ మంత్రి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు అని తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎలక్షన్స్ కు ఓటరు నమోదును వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సత్తుపల్లి పర్యటనలో మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి అధ్యక్షులను పట్టభద్రుల ఓటరు నమోదు చేయించాలని వార్డుల వారీగా విభజించుకుని కరోన నేపథ్యంలో నూతన ఓటర్లు నమోదు ఆన్లైన్ చేయాలని తెలిపారు. అశ్వరావుపేట నియోజకవర్గం లోని కాంగ్రెస్ మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించిన భట్టి విక్రమార్క ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అందులో భాగంగా ప్రతి మండల అధ్యక్షుడు పోరాటాన్ని ఉధృతం చేయాలని ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు . అన్నపురెడ్డిపల్లి మండలం నుంచి భీముడు చేస్తున్న నష్టపోయిన రైతుల పంటలు పరిశీలన సమాచారం తెలుసుకుని ఆయనను అభినందించారు. రైతులకు జరిగిన నష్టాన్ని ప్రతి ఒక్కరూ అలాగే ప్రతి మండలంలో పర్యటించి నివేదికను వ్యవసాయ అధికారులకు సమర్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వ వైఖరిపై పోరాటాన్ని ఉధృతం చేయాలని దిశానిర్దేశం చేసిన భట్టి విక్రమార్క . వరి, పత్తి ,మిరప ,అరటి నష్ట పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం వచ్చేంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం



పోరాటం చేస్తుందని హెచ్చరించారు . రైతుల పక్షాన ఎల్లవేళలా కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా ఉంటుందని రైతుల కోసం ప్రత్యేక ప్రణాళికా రానున్న మన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి రైతుకు అండగా ఉంటుందని తెలిపారు. పాల్గొన్న కాంగ్రెస్ వివిధ మండలాల మండల అధ్యక్షులు ,కార్యకర్తలు ,కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు లేబర్ భీమా కార్డుల పంపిణీ

### సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**వెల్గటూర్, అక్టోబర్ 26 (ప్రజా పాలన) :** సోమవారం రోజు కరీంనగర్ క్యాంప్ కార్యాలయం లో వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు జూపాక సురేష్,జోగం లక్ష్మణ్ మరణించగా వారి కుటుంబ సభ్యులకు మంజూరు అయిన లేబర్ భీమ కార్డులను తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందించా రు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక ఉపాధి విజిలెన్స్ మానిటరింగ్



కమిటీ సభ్యులు సిగిరి ఆనంద్, వెల్గటూర్ గ్రామ తె.రా.స శాఖ అధ్యక్షులు గుండ జగదీశ్వర్ ఎండపెల్లి సహకార సంఘం అధ్యక్షులు గూడ రాంరెడ్డి, నాయకులు చుక్క శంకర్ రావు పాల్గొన్నారు.

### సిద్దిపేట పోలీసులు అతిగా ప్రవర్తించారు: జితేందర్‌రెడ్డి


దుబ్బాక: సిద్దిపేట పోలీసులు అతిగా ప్రవర్తించారని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఓటమి భయంతో టీఆర్ఎస్ ఇలా చేస్తోందని ఎద్దేవాచేశారు. నోటీసులు లేకుండా పోలీసులు సోదాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. సిద్దిపేట లెక్చరర్స్ కాలనీలో దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు మామ ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. రూ. 18.65 లక్షలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు చెబుతున్నారు. కావాలనే పోలీసులు ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ నేతలు మండిపడ్డారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నేతలు నినాదాలు చేశారు. రఘునందన్‌రావు బంధువుల ఇళ్ళలో సోదాలను బీజేపీ నాయకురాలు డీకే అరుణ ఖండించారు. వేల కోట్లున్న టీఆర్ఎస్ నేతలను వదిలి.. బీజేపీ నేతల ఇళ్లపై పడటం సిగ్గుచేటన్నారు.

### బీహార్ ఎన్నికలు చాలా చిత్రం

**పాట్నా అక్టోబరు 26,(ప్రజా పాలన) :**బీహార్ ఎన్నికలు చాలా చిత్రంగా జరుగుతున్నాయి. ఒకవైపు పూర్తిగా అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి అభ్యర్థి. మరోవైపు అనుభవం లేని నేత నేతృత్వంలోని కూటమి. మరోవైపు నిజాయితీ పరుడిగా ఉన్న ముఖ్యమంత్రి అభ్యర్థి. మరోవైపు అనేక అవినీతి ఆరోపణలున్న కుటుంబం నుంచి వచ్చిన నేత. ఇలా చెప్పుకుంటూ పోతే బీహార్ ఎన్నికల్లో ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థుల మధ్య ఆసక్తికరమైన చర్చ జాతీయంగా కూడా జరుగుతుంది. బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీష్ కుమార్ ను ప్రకటించింది. అయితే ఐదేళ్ల పాటు ఆయన పాలనపై ఉన్న అసంతృప్తి కొంత ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని చెప్పక తప్పదు. నితీష్ కుమార్ పై అవినీతి మచ్చ ఇంతవరకూ లేదు. ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయమూ ప్రజల సంక్షేమం కోసమేనని జనమూ నమ్ముతారు. మరోవైపు యూపీఏ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వియాదవ్ ను ప్రకటించింది. మహాకూటమికి మైనస్ అన్న వ్యాఖ్యలు సర్వత్రా విన్పిస్తున్నాయి. నితీష్ కుమార్ తో పోల్చుకుంటే అనుభవంలోనూ, ఏ విషయంలనూ తేజస్వి యాదవ్ పనికిరారనే వాళ్ల సంఖ్య బీహార్ లో ఎక్కువగానే ఉంది. నిజానికి లాలూ యాదవ్ పై అవినీతి కేసులున్న ఆయన క్రౌడ్ పుల్లర్. మాస్ లీడర్. అయితే లాలూ యాదవ్ చిన్న కొడుకు తేజస్వి యాదవ్ కు మాత్రం మాస్ లీడర్ గా ముద్రపడలేదు. ఆయన జనంలో కలిసేది కూడా తక్కువేనంటారు. తేజస్వి యాదవ్ కు నాయకత్వం పటిమ లేదని సొంత పార్టీనేతలే రాజీనామా చేసి బయటకు వెళ్లిపోయిన సంఘటనలు చూశాం. అయితే లాలూ యాదవ్ నిర్మించిన బలమైన ఓటు బ్యాంకు ఉండటంతో ఇక్కడ ప్రధాన పార్టీగా ఆర్జేడీ ఉంది. పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. బీహార్ లో బలహీనంగా ఉన్న కాంగ్రెస్ ఆర్జేడీ ప్రతిపాదనలకు తలొగ్గాల్సి వచ్చిందంటారు. తేజస్వియాదవ్ పేరును ప్రకటించకపోతే కొంత మహా కూటమికి లాభం చేకూరేదనే కామెంట్స్ బాగా విన్పిస్తున్నాయి. మొత్తం మీద బీహార్ మహాకూటమికి మైనస్ తేజస్వియాదవ్ అంటూ టాక్ బలంగా విన్పిస్తుంది.

# టార్గెట్ పశ్చిమ బెంగాల్

కోల్ కత్తా, అక్టోబరు 26, :పశ్చిమ బెంగాల్ లో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. తన ప్రధాన ప్రత్యర్థి బీజేపీ కావడంతో ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆ పార్టీనే టార్గెట్ చేస్తున్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలపై వరస కేసులు నమోదవుతున్నాయి. రాజకీయ కక్షలతోనే తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే నిబంధనల మేరకే కేసులు నమోదు చేస్తున్నామని మమత బెనర్జీ ప్రభుత్వం చెబుతోంది. పశ్చిమ బెంగాల్ లో మరికొద్ది నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ ల మధ్యనే ఉంటుందని విశ్లేషకులు సయితం అంగీకరిస్తున్నారు. గత ఐదేళ్లలో బీజేపీ పశ్చిమ బెంగాల్ లో బాగా బలపడింది. మరో వైపు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. బీజేపీ బలపడటంతో ఈ రెండు పార్టీలు బలహీన మయ్యాయన్నది వాస్తవం. అందుకే ఇప్పుడు బీజేపీ రేసులో ముందుంది. మమత బెనర్జీ మోదీ ప్రభుత్వంపై తరచూ కాలుదువ్వుతుండటంతో కేంద్ర నాయకత్వానికి మింగుడుపడటం లేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో కాషాయంజెండాను ఎలాగైనా పశ్చిమ బెంగాల్ లో ఎగరేయాలని భావిస్తున్న కమలం పార్టీ ఆ రాష్ట్ర పార్టీ నేతలకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. పార్టీ కార్యక్రమాల కు నిధుల కొరత లేకుండా ప్రత్యేక నిధులను కూడా కొన్నేళ్లుగా పంపిణీ చేస్తూ వస్తుంది. ముఖ్యంగా




అమిత్ షా, మోదీలు పశ్చిమ బెంగాల్ లో పాగా వేసి మమత బెనర్జీని దెబ్బతీయాలన్న ఏకైక లక్ష్యంతో ఉన్నారు. మరోవైపు గవర్నర్ కూడా మమత బెనర్జీకి ఇబ్బందికరంగా మారారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగ్ దీప్ ధన్ కర్ తరచూ ప్రభుత్వా నికి వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ మమతను ఇబ్బంది పెడుతున్నారు. తాజాగా రాష్ట్రంలో పోలీసులు రాజ్యమేలుతున్నారని గవర్నర్ చేసిన వ్యాఖ్యలు కాకరేపుతున్నాయి. గవర్నర్ కూడా బీజేపీకి ఇతోధికంగా తన వంతు సాయం చేస్తున్నారు. మొత్తం మీద మమత బెనర్జీ ఓట్ల వేటలో వీరందరిని తట్టుకుని ఎలా నిలబడుగలుగుతారన్నది ఆసక్తికరంగా మారింది.

# తమిళనాడులో తృతీయ కూటమి ..?

చెన్నై,అక్టోబరు 26,:కమల్ హాసన్ రజనీకాంత్ లాగా కాదు. ఆయన పార్టీ పెట్టిన నాటి నుంచి ఓడినా, గెలిచినా దాని వెంటే తిరుగుతున్నారు. పార్టీ కోసం సమయం వెచ్చిస్తున్నారు. కమల్ హాసన్ తమిళనాడులో మక్కల్ నీది మయ్యమ్ పార్టీని పెట్టిన సంగతి తెలిసిందే. అయితే మొన్నటి ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపకపోయినా కమల్ హాసన్ ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ఆయన సమాయత్తమవుతున్నారు. వచ్చే సంవత్సరం తమిళనాడు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే అధికార డీఎంకే, అన్నాడీఎంకేలు కూటములు కట్టి బరిలోకి దిగుతున్నాయి. డీఎంకే కాంగ్రెస్ తోనూ, అన్నాడీఎంకే బీజేపీతోనూ జట్టుకట్టి చిన్నా చితకా పార్టీలను తమ కూటమిలోకి చేర్చుకున్నాయి. కానీ కమల్ హాసన్ మాత్రం ఏ కూటమిలో చేరేందుకు ఇష్టపడటం లేదు. ఆయన రజనీకాంత్ పార్టీ పెడితే ఆయనతో కలసి నడవాలనుకున్నారు.

రజనీకాంత్ పార్టీపై స్పష్టత లేకపోవడంతో డీఎంకే, అన్నాడీఎంకేకు వ్యతిరేకంగా మరో కూటమిని ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంతో కమల్ హాసన్ ఉన్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు తమిళనాడులో కీలకంగా ఉన్న పార్టీల నేతలతో కమల్ హాసన్ చర్చలు జరిపారని చెబుతున్నారు. ప్రస్తుతం తమిళనాడులో తృతీయ కూటమి అవసరమని కమల్ హాసన్ గట్టిగా భావిస్తున్నారు. కమల్ హాసన్ ఏ కూటమిలోకి వెళ్లినా ఆయన పార్టీకి కేటాయించే స్థానాలు తక్కువగానే ఉంటాయి. అందుకే ఆయన తృతీయ కూటమిని ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారు. అలాగే కమల్ హాసన్ కు ఒక గోల్ ఉంది. అది నెరవేరుతుందా? లేదా? అన్నది పక్కన పెడితే తమిళనాడుకు తాను ముఖ్యమంత్రిని కావాలనుకుంటున్నారు. రజనీకాంత్ అలా కాదు. తాను ముఖ్మమంత్రి అభ్యర్థిని కాబోనని రజనీ ప్రకటంచి అభిమానులకు షాక్ ఇచ్చారు. కానీ కమల్ హాసన్ మాత్రం అలా కాదు తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా మరో కూటమిని ఏర్పాటు చేసి దానికి నేతృత్వం వహించాలని భావిస్తున్నారు. మరి కమల్ హాసన్ ప్రయత్నాలు ఫలిస్తాయో? లేదో? చూడాలి.

bahujan bazaar
(a unit of sneha group of organization Since - 2001)
బహుజన సాహితీ ప్రియులకు శుభవార్త!!!
మీ ఇంటి వద్దకే బహుజన సాహిత్యాన్ని
చేరవేస్తుంది బహుజన్ బజార్
సాహిత్యాన్ని చదవండి-చదివించండి
సమాజాన్ని మేల్కొల్పండి
బహుజన రాజ్యాధికారానికి ముందడుగు
వేయండి.బహుజన సాహిత్యాన్ని చదవడం
ద్వారా అందరం చైతన్యవంతులమవుదాం.
www.bahujanbazaar.in లో
లాగిన్ అయ్యి మీ పేరును ఈరోజే
నమోదు చేసుకోండి.
జై భీమ్ జై పూలే జై బహుజన
Bahujanbazaar : 6.2-29/3/12, 3rd floor, Doulat plaza, lakidikapool,hyderabad-04
www.bahujanbazaar.in 04023233989

# ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 27, అక్టోబరు 2020


## పట్టణాల్లో ప్రజలకు ఉపాధి కల్పించండి..!

పట్టణాలలో ప్రజలపై భారాలు ఎక్కువయ్యాయి. ఆస్తి పన్ను, విద్యుత్ చార్జీలు, యూజర్ చార్జీల పేరుతో భారాలు మోపడానికి కేంద్ర ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనలు అంగీకరించి భారాలు మోపడానికి సిద్ధమవుతున్నది. ప్రతిఘటించకపోతే పౌర సదుపాయాల మనుగడ ప్రమాదంలో పడుతుంది. పట్టణాల అభివృద్ధికి ప్రజా సౌకర్యాల కల్పన అత్యంత ముఖ్యమైన అంశం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఈ లక్ష్యంతోనే ఉచిత విద్య, ఉచిత వైద్యం, పారిశుధ్య సౌకర్యం, ఉచితంగా మంచినీరు, రోడ్లు, విద్యుత్ మొదలగు సౌకర్యాలు కల్పించబడ్డాయి. పౌర సదుపాయాలు బాగా కల్పించడం ద్వారా వేగంగా పట్టణాల అభివృద్ధిని సాధించవచ్చని, పరిపాలనా కేంద్రంగాను, విద్య, వైద్య కేంద్రంగాను అభివృద్ధి కావడమే కాక పారిశ్రామిక అవసరాలు కూడా తీరుతాయని నాడు భావించబడింది. పేదలు నివసించే ప్రాంతాల్లో ఉచితంగా మంచినీటి కుళాయిలు వచ్చాయి. స్కూళ్లు, హాస్పిటళ్లు వచ్చాయి. మందులు ఉచితంగా ఇచ్చారు. ఇళ్ల స్థలాలను నల్ల డబ్బుతో అవసరానికి మించి కొనుక్కునే అవకాశం లేకుండా గతంలో సీలింగు విధించారు. ఇది కొందరికి స్థలాలు పొందే అవకాశం కలిగించింది. ఇప్పుడు నరేంద్ర మోడీ ప్రభుత్వం పట్టణ ప్రజలను కార్పొరేట్ కంపెనీలు దోచుకోవడానికి వీలుగా పట్టణాల్లో పిపిపి ప్రాతిపదికన అద్దె ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతూ విధానాన్ని ప్రకటించింది. ఆస్తి పన్ను పెంచి పౌర సదుపాయాల ఖర్చు భారాన్నంతా ప్రజల మీద మోపుతోంది. యూజర్ చార్జీలు మరొక దొంతరే. చెత్తకు యూజర్ చార్జీలు, జనన, మరణ కాగితాలకు యూజర్ చార్జీలే. ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్, రోడ్డు ట్యాక్స్, సేల్స్ ట్యాక్స్, మార్కెట్ ట్యాక్స్ మొదలగు ఎన్నో రకాల పన్నులు స్థానిక సంస్థల పరిధి నుండి కేంద్రం స్వాధీనం చేసుకుంది. ఇప్పుడు పౌర సదుపాయాలన్నింటికీ అయ్యే ఖర్చునంతా ప్రజల మీద మోపడానికి కేంద్రం సిద్ధమైంది. స్థలం విలువ, భవనం విలువ లెక్కగట్టి ఆస్తి పన్ను విధించాలని కేంద్రం షరతు పెట్టింది. రాష్ట్రం అప్పులు తెచ్చుకోవాలన్నా, అభివృద్ధి పనులు చేపట్టాలన్నా కేంద్రం షరతులు పాటించాలి. అలాగే మంచినీటి పంపులకు నీటి మీటర్లు వస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణకు అయ్యే ఖర్చు మొత్తం జనం నెత్తిన వేసే విధానాలు వచ్చాయి. పట్టణాలలో ఇక పేదలకు కేంద్రం షరతుల ప్రకారం ఇళ్లు, ఇళ్ల స్థలాలు దొరకవు. కార్పొరేట్లు కట్టే అద్దె ఇళ్ళే గతి. లక్షల సంఖ్యలో ప్రభుత్వ స్థలాల్లో, కొండ పోరంబోకుల్లో ఇళ్ళు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్న డిమాండు పెండింగులోనే ఉన్నది. కేంద్ర షరతుల మేరకు కరెంటు చార్జీలూ పెరగనున్నాయి. రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానిక సంస్థల నుండి వసూలు చేసిన పన్నులలో 40 శాతం వాటా స్థానిక సంస్థలకు ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదు. రాష్ట్రాలకిచ్చే గ్రాంట్లు కోత పెట్టారు. ఇలాంటి కేంద్ర ప్రభుత్వ విధానాల్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు జరపపూనుకుంటున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల పారిశుధ్యం, ప్రజారోగ్యం దెబ్బ తింటున్నది. మురుగు నీటి పారుదల, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, దోమల నివారణ అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. బ్రిటిషు ఇండియాలో పారిశుధ్య పాటింపుకు, దోమల నివారణకు మున్సిపల్ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. ఈ కాలంలో ఈ లక్ష్యానికి ప్రభుత్వ విధానాలు దెబ్బ కొట్టాయి. అందరికీ ఇళ్లు, అందరికీ విద్య, వైద్యం, మంచి నీరు, రోడ్లు, విద్యుత్ సరఫరా ప్రభుత్వ బాధ్యత. పౌర సదుపాయాల కల్పనతోనే నగరాలు, పట్టణాలు అభివృద్ధి సాధ్యం. అరకొర సౌకర్యాలతో అస్తుబిస్తుగా ఉన్న నగరాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఆటంకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కరోనా వ్యాప్తి ఉన్న ఉపాధినీ దెబ్బ తీసింది. నూటికి యాభై మందికి ఉపాధి పోయింది. కార్మికులలో నూటికి తొంభై మందికి పైగా రకరకాల పనులు చేసుకునేవారే. ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర అసంఘటిత రంగంలో ఉన్న వారు పట్టణాలలో అర్ధాకలితో కాలం గడుపుతున్నారు. భవన నిర్మాణ కార్మికులకు కరోనా సహాయం అందిస్తామని బ్యాంకు అకౌంట్లు అడిగిన రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందించనేలేదు. కనీస వేతనాల బోర్డు సిఫారసులతో దక్షిణాది రాష్ట్రాలలో కనీస వేతనాలు రూ.12 వేల నుండి రూ.18 వేల వరకు ఉంటే మన రాష్ట్రంలో అది రూ.5 వేలే. 15 సంవత్సరాల క్రితం నియమించిన కనీస వేతనాల బోర్డు రాష్ట్రంలో ఇప్పటికీ నియమించలేదు. పట్టణాలలో ఉపాధి తీవ్ర సమస్యగా ఉన్నది. షాపుల్లో పని చేసే వారికి 15 రోజులే ఉపాధి. వ్యాపారస్తులకు అమ్మకాలు తగ్గిపోయాయి. ఆదాయాలు తగ్గి అనేక వ్యాపారాలు దివాళా ఎత్తాయి. ఈ సమయంలోనే నిత్యావసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణాలలో ఈ కరోనా వైపరీత్యం వృత్తిదారులను, వ్యాపారస్తులను, ఆఖరుకు రైతులను ఎవరినీ వదల్లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల చేతుల్లో డబ్బు పెట్టాలి. ఆరు మాసాల పాటు కుటుంబానికి రూ.7,500, తలా ఒక్కొంటికి 10 కిలోల బియ్యం ఇవ్వాలి. గ్రామాలలో వలే పట్టణాలలో కూడా ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టి పని దినాలు కల్పించాలి. ఆస్తి పన్ను, చెత్త పన్ను, నీటి మీటర్లు ఆపాలి. నగరాలలో ప్రజల మీద భారాలు మోపడాన్ని ఎదుర్కోవడం తప్ప మరో మార్గం లేదు. బాధల్లో ఉన్న ప్రజలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# బీహార్ ఫలితాలతో కొత్త సంకేతాలు?



బీహార్ ఎన్నికల ప్రణాళికలో బిజెపి కరోనా వ్యాక్సిన్ ఉచితంగా ఇస్తానని వాగ్దానం చేయడంపై ఎన్నో విమర్శలు, విసుర్లూ రావడం అక్కడ పరిస్థితికి ప్రతిబింబం. కరోనా వ్యాక్సిన్ ఇంకా తయారు కాలేదన్నది ఒకటైతే, కేంద్రంలో పాలన చేసే పార్టీ ఒక రాష్ట్రంలోనే ఆ విధమైన వాగ్దానం ఎలా చేస్తుందనేది అంతకన్నా కీలకమైన ప్రశ్న. కాని బీహార్‌లో నితీష్ కుమార్ నాయకత్వం లోని ఎన్‌డిఎ ప్రభుత్వం కరోనాను అరికట్టడంలో విఫలమైన తీరుపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని గుర్తించక తప్పలేదు గనకే బిజెపి ఈ విపరీత వాగ్దానం చేసింది. గత ఎన్నికల్లోనూ ప్రధాని మోడీ 2015లో 'ఎన్ని వేల కోట్ల ప్యాకేజీ కావాలి. లక్ష కోట్లా...? రెండు లక్షల కోట్లా...?' అని ఊరించిన తీరు అపహాస్యం పాలైంది. ప్రజలు కూడా వాటిని విశ్వసించలేదు గనకే బిజెపిని పూర్తిగా తిరస్కరించి ఆర్‌జెడి తో కలసి ఒకటిగా ముందుకొచ్చిన నితీష్ కూటమిని గెలిపించారు. కాని తర్వాత నితీష్ నీతి మాలిన రాజకీయంతో ఆ కూటమి నుంచి ఆర్‌జెడి ని తొలగించి మళ్లీ ప్రజలు తిరస్కరించిన బిజెపి కి ప్రభుత్వ పగ్గాలు అప్పగించారు. గద్దెపై ముఖ్యమంత్రిగా తానున్నా ఈసారి నితీష్ పూర్తిగా పరాధీనమై పోయారన్నది జనవాక్యంగా మారింది. ఇప్పుడు అసెంబ్లీ ప్రచారం లోనూ ఎక్కడ చూసినా మోడీ బమ్మలే దర్శనమిస్తున్నాయి. సభలు కూడా ఆయనే ఎక్కువగా నిర్వహిస్తున్నారు. పదిహేనేళ్ల నితీష్ పాలనలో బీహార్ సుపరిపాలన ప్రచారం తలకిందులై అవినీతి, అత్యాచారాలు, అసమర్థత తాండవిస్తున్నాయి. మోడీకి తనే ప్రత్యామ్నాయమన్న స్థాయిలో ఆయనను రానివ్వబోనని చెప్పిన నితీష్ మధ్యలో మళ్లీ గెలవడానికి నాటకం నడిపి ఆ తర్వాత మళ్లీ నెత్తిన పెట్టుకోవడం రాజకీయ అనైతికతకు పర్యాయ పదమైంది. ఉత్తర భారత దేశంలో బిజెపి నేరుగా అధికారం లోకి రాలేకపోయిన ఏకైక రాష్ట్రం బీహార్. 1990వ దశకంలో వి.పి.సింగ్ ను కూలదోసేందుకై అద్వానీ రథయాత్ర పేరుతో మండల్‌కు పోటీగా కమండల్ రథయాత్ర మొదలెట్టినప్పుడు పగ్గాలు వేసింది బీహార్. అప్పటి నుంచి పదిహేనేళ్లు లాలూ...ఆయన గడ్డి కుంభకోణంలో చిక్కాక రబ్రీదేవి పాలన నడిచింది. మరో పదిహేనేళ్లుగా నితీష్ ఏలుతున్నారు. ఏమైనా ఆ పరివర్తన ఒక్కసారిగా గాని, నాటిగా గాని జరగలేదని గుర్తుంచుకోవాలి. ఒక దశలో రామ్‌విలాస్ పాశ్వాన్ నాయకత్వం లోని ఎల్‌జెపి ఇటు నిలిచి వుంటే నితీష్ పాలన ఇన్నాళ్లు సాగివుండేది కాదు. అవకతవకలు, ఆరోపణలూ ఎన్ని వున్నా లాలూ కొంతమందిలా బిజెపి మతతత్వ రాజకీయాలతో రాజీ పడలేదు. వారి వ్యూహాలకు ప్రతిగా మైనార్టీలను, బి.సి లు ఎస్.సి లను నిలబెట్టగలిగారు.

### ఎన్నెన్నో పరిణామాలు

భారత దేశంలో మొదటి మహా సామ్రాజ్యమైన మౌర్యవంశం నాటి నుంచి బీహార్‌ను వెనకబడిన కులాల చైతన్యానికి నిలయంగా చెబుతుంటారు. 1970లలో జయప్రకాశ్ ఉద్యమం కూడా అక్కడే మొదలైంది. అప్పటి నుంచి దాన్ని హైజాక్ చేయడానికి బిజెపి కూటమి తంటాలు పడుతూనే వుంది. లౌకిక శక్తుల అనైక్యత వారు అధికారంలో వున్నప్పటి తప్పిదాలు కలసి అందుకు అవకాశమిచ్చాయి. 2015లో కేంద్రంలో మోడీ ఘన విజయం సాధించిన తర్వాత మొదట దెబ్బతిన్నది బీహార్‌లోనేనంటే దానికి కారణం నితీష్ ఎన్‌డిఎ నుంచి నిష్క్రమించి ఆర్‌జెడి తో కలవడమే. ఆ ఎన్నికల్లో మోడీగాని, అప్పటి బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా గాని చేసిన ప్రసంగాలు జుగుప్స కలిగించాయి. నితీష్ కూటమి గెలిస్తే పాకిస్తాన్‌లో పండుగ చేసుకుంటారని నోరు పారేసుకున్నారు. ఆ సమయంలోనూ సర్వేలు బిజెపి కి గెలుపునే జోస్యం చెప్పాయి. కాని కూటమి ఘన విజయంతో మోడీ మోతకు పగ్గాలు పడ్డాయి. తేజస్వి యాదవ్ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. కాని కుటిల నీతికి మారు పేరైన నితీష్ కుమార్ ఒక క్రమపద్ధతిలో దానికి తూట్లు పొడిచారు. లాలూను దేశంలోనే అరాచకానికి మారుపేరుగా చిత్రించిన మోడీ అనుకూల మీడియా ఆ ప్రచారాన్ని పునరుద్ధరించింది. కేంద్రం పత్యేకంగా వారిపైనే దాడులు చేసి రెచ్చగొట్టింది. నితీష్ వ్యూహాత్మకంగా విడగొట్టుకోవడంతో వారూ ఆ విధంగానే ప్రతిస్పందించారు. ఏ విలువలూ పాటించని నితీష్ మళ్లీ బిజెపితో దోస్తీకి తలుపులు తీశారు. లాలూకు శిక్షపడినా జైలు పాలైనా ఆ కుటుంబం, ఆర్‌జెడి లు మళ్లీ ఊపిరి పోసుకోవడానికి తనతో పొత్తు కారణమని ఆయన భయపడ్డారు. ఈ తలకిందులు రాజకీయాన్ని జెడియు అధ్యక్షుడైన శరద్ యాదవ్ వ్యతిరేకిస్తే రాజ్యసభలో ఆయన సభ్యత్వం రద్దు చేయించారు. ఒకప్పటి సోషలిస్టు కుదురు నుంచి వచ్చిన జనతాదళ్ పరివారంతో కర్ణాటకలో కుమారస్వామి గౌడ ఒకసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం మినహా మరెవరూ బిజెపి తో నేరుగా కలిసిన సందర్భం లేదు. కాని నితీష్ మాత్రం మొదటి నుంచి అందుకు విరుద్ధం. 2019లో రాష్ట్రం లోని లోక్‌సభ స్థానాలు ఇంచుమించు మొత్తంగా వారే గెలుచుకోగలిగినా అది మోడీ పట్టును పెంచి నితీష్‌ను తగ్గించింది.

### చిరాగ్ వెనక బిజెపి

పదిహేనేళ్ల పాలనలో నెరవేరని వాగ్దానాలతో ప్రజలలో పలుచనై పోయారని, ప్రతిష్ట కోల్పోయారని బిజెపి భావిస్తున్నది. రామ్‌విలాస్ పాశ్వాన్ కుమారుడైన చిరాగ్ పాశ్వాన్ మోడీకి విధేయత చాటుతూనే కూటమి నుంచి బయిటకు రావడం వెనక బిజెపి హస్తం బహిరంగ రహస్యం. అందుకే ఆయన మోడీని అతిగా పొగుడుతూ నితీష్ పైనే బాణాలు ఎక్కుపెడుతున్నారు. ప్రజా వ్యతిరేకత మూటకట్టుకున్న నితీష్ పాలనతో విడగొట్టుకుంటూ వీలైతే రేపు చిరాగ్‌తో కలసి పాలన లోకి రావాలని బిజెపి కలలు కంటున్నది. అయితే ముఖ్యమంత్రిగా ఆయనను ముందుంచక తప్పని స్థితి. ఇరువైపులా ఘనీభవించిన ఈ అవకాశవాదంతో నితీష్...మోడీ ప్రచారంపై ఆధారపడటం ఒకవైపు ఆయనను ముందుంచుతూనే తమ వ్యూహాలు సాగిస్తున్న బిజెపి నేతల చాణక్యం మరోవైపు బీహార్ రాజకీయాలను రక్తి కట్టిస్తున్నాయి. కేంద్రం ఆధీనం లోని నీతి ఆయోగ్ కూడా బీహార్ వెనకబడిపోయినట్టు లెక్కలు విడుదల చేసింది. జాతీయ నేరాల సంస్థ లెక్కలు కూడా అలాగే వున్నాయి.

### వామపక్షాల పొత్తు

తేజస్వి యాదవ్ నాయకత్వంలో ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాల సంఘటన మహాఘట్‌బంధన్‌కు ప్రచారంలో ప్రజాదరణ కనిపిస్తున్నది. సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్ మూడింటికీ బీహార్‌లో తమవైన కేంద్రాలు వున్నాయి. లాలూ తో కలసి పోటీ చేసిన సిపిఐ కి 1995లో అక్కడ 25 స్థానాలుండేవి. సిపిఎం భూ పోరాటాలలో లాలూ హయాం లోనే తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొని పునాదిని కాపాడుకున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో బీహార్‌లో ఎన్‌డిఎ ఓటమి దేశంలో లౌకిక శక్తుల పురోగమనానికి, బిజెపిని ఎదుర్కోవడానికి చాలా కీలకమని సిపిఎం భావిస్తున్నది. నాలుగు స్థానాల్లో పోటీ చేస్తున్న సిపిఎం రాష్ట్ర కమిటీ ఒక ప్రణాళికను కూడా విడుదల చేసింది. ఆర్‌జెడి కూటమి సీట్ల సర్దుబాటు త్వరగా పూర్తి చేసుకుని రంగంలోకి రావడం, వామపక్షాలు మొత్తం భాగస్వాములుగా వుండటం సానుకూల అంశంగా వుంది. తన వయసులో సగం కూడా లేని యువ నాయకుడైన తేజస్విపై నితీష్ పేరెత్తి మరీ దాడి చేయడం బట్టి పోటీని ఎంత తీవ్రంగా తీసుకుంటున్నారో తెలుస్తుంది. లాలూ ప్రసాద్ ఆటవిక పాలన నుంచి బీహార్‌ను విముక్తి చేసిన ఘనత నితీష్ ది అని చెప్పిన వ్యాఖ్యాతలు కూడా ఇప్పుడు సమర్థించలేకపోతున్నారు. నితీష్‌ను బాగా బలపర్చిన పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయి తాజాగా రాసిన వ్యాసం చూస్తే ఆయన స్థానం ఎంతగా దిగజారిందో తెలుస్తుంది. ఎన్‌డిఎ కూటమిపై జరిగే పోరాటంలో చిరాగ్ పాశ్వాన్ ఎల్‌జెపి, ఒవైసీ మజ్లిస్ నాయకత్వంలో ఏర్పడిన మరో కూటమి సైంధవ పాత్ర పోషిస్తున్నాయి. కాంగ్రెస్, ఆర్‌జెడి లు ఎన్‌డిఎను నిలవరించలేవనీ తామే ఓడిస్తామని విస్తారంగా పోటీలు పెట్టిన మజ్లిస్, బిఎస్‌పి కూటమి ఓట్ల చీలికకు కారణమవుతున్నది.

### ఆశలు, అంచనాలు

నితీష్ కు మహిళల ఓటింగు పెట్టని కోట అని అంటున్నా ఈ కాలంలో ముజఫర్ పూర్ మహిళాశ్రమంలో అత్యాచారాలపై సిబిఐ చార్జిషీటు మేరకు శిక్షలు పడటం సంచలనం కలిగించిన పరిణామం. ఇక మహిళా వికాస్ సమితిలో రెండు వేల కోట్లు, బి.సి ల అభివృద్ధి సమితి పేరిట జరిగిన మరో భారీ కుంభకోణం కుదిపేశాయి. టాయిలెట్ల కుంభకోణం, కుళాయిల కుంభకోణం రోత పుట్టించాయి. హథ్రాస్ అత్యాచారానికి ముందే ఏరియాలో దళిత బాలికపై అమానుషం జరగడమే గాక ఆమె తల్లిదండ్రులను జైలు పాలు చేయడం తీవ్ర నిరసనకు దారితీసింది. ఆ యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇప్పుడు పాలక కూటమికి ప్రధాన ప్రచారాకర్షణగా మారడం దళిత వర్గాలను వెక్కిరిస్తున్నది. ఆర్‌జెడి పదిహేనేళ్ల పాలనలో పది లక్షల ఉద్యోగాలు కల్పించామంటే ఎగతాళి చేసిన బిజెపి తాము 19 లక్షల ఉద్యోగాలిస్తామని గొప్పగా వాగ్దానం చేయడం ఎలా చూడాలని సిపిఎం రాష్ట్ర కమిటీ నిలదీసింది. బీహార్‌లో మిల్లుల మూతను నివారించి తగు చర్చలు తీసుకునే బదులు దేశానికే చౌకగా వలస కార్మికులను ఎగుమతి చేసే ఫ్యాక్టరీగా మారిందని నితీష్ నింద మూట కట్టుకున్నారు. లాక్‌డౌన్ కాలంలో వలస కార్మికుల సమస్య బీహార్‌నే ఎక్కువగా ప్రభావితం చేసింది. తిరిగి వచ్చిన వారు పని, తిండి లేక నానా పాట్లు పడాల్సి వచ్చింది. ఈ వాస్తవాలన్నీ ప్రజల దృష్టిలో వుండబట్టే ప్రభుత్వ వ్యతిరేకత ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ఇక చిరాగ్ పాశ్వాన్, మోడీని కీర్తిస్తూనే తనూ నితీష్‌కు వ్యతిరేకమన్నట్టు సాగించే ప్రచారం తికమక పెడుతున్నది. వీటన్నిటినీ అధిగమించి తామే విజయం సాధిస్తామనీ, నవంబరు 9న నితీష్ ఓడిపోతే 10న లాలూ బెయిలుపై విడుదల కానున్నారని తేజస్వి చెబుతున్నారు. తేజస్వి యువ నాయకత్వంపై ఆసక్తి పెరుగుతుండగా యువత నుంచి నితీష్ ప్రసంగాలకు డిజ్‌లైక్స్ పెరుగుతున్నాయని కొంతమంది పోల్చి చూపిస్తున్నారు. సిఎఎ వంటి సమస్యలపై ఆయన నోరు మెదపకపోవడం ప్రజాస్వామిక చైతన్యం గల బీహార్ ప్రజలకు మింగుడు పడటంలేదు. అందుకే మోడీ ప్రచారంలో కాశ్మీర్ సమస్య, చైనాతో ఉద్రిక్తతలో బీహార్ జవాన్ల పాత్ర వంటి అంశాలను లేవనెత్తి తనదైన జాతీయ వాదం జప్పించాలని చూస్తున్నారు. రాష్ట్రంలో అస్తవ్యస్త పాలనా పరిస్థితుల రీత్యా గత ఎన్నికల్లో పాకిస్తాన్ కార్డు విఫలమైనట్టే ఇవి కూడా విఫలం కావలసిందే. లాలూ పాలన బీహార్‌ను 'బిమారు' రాష్ట్రంగా మార్చిందంటున్న మోడీ పదిహేనేళ్లుగా తామే పాలిస్తున్న పరమ సత్యం మర్చిపోతున్నారు. ఇప్పుడు మతతత్వ రాజకీయాలు, హక్కులపై దాడి, కరోనా అనంతర సంక్షోభం, అత్యాచారాలు దేశాన్నే ఆవరించాయి. ఈ పరిస్థితులలో తొలి పరీక్షగా బీహార్ ఎన్నికలను చూడవలసి వుంటుంది. దీని తర్వాత బెంగాల్, యు.పి తదితర ఎన్నికలు వస్తాయి. జోస్యాలు, సర్వేలు ఎలా వున్నా గతంలో చాలాసార్లు చారిత్రిక పరిణామా లకు సాక్షిగా నిలిచిన పాటలీపుత్రం ప్రస్తుత తీర్పు ఎలా వుంటుందని దేశమంతా ఆసక్తిగా చూస్తున్నది. లౌకిక శక్తుల విజయం ఆశిస్తున్నది.

## కమ్మటి మాట

ముంగార్లప్పుడొచ్చిన వాన
ఇబ్బుడిగ్గూడా ఆవాసన కమ్మగొత్తాంది!
పచ్చిగడ్డి కాలంలో...
పచ్చిగడ్డి తిన్న ఆవులేసే ప్యాడకాళ్లు
పచ్చగా ఆవాసన ఎంత కమ్మగొచ్చేదో?

మడిగోసినప్పుడు కల్లంలోని వడ్లు
కావు పట్టున్న ఆవాసన ఎంత కమ్మగుండేదో?
చీనాచెట్లు పూతకొచ్చినప్పుడు
తోటంతా తెల్లగా ఎంత గుమ్మట్లాడిత్తుందో?

తేనీగలు సోపినప్పుడు
తేనిపెట్టె నుండి కారే తేని
నోట్లోకి కర్సుకొని గుటకలేత్తాంటే...
పక్కనున్నోళ్ళ నోళ్ళు లొట్టలేసేవి!
వాళ్ళని చూసి నా సంకలు గుద్దుకునేటోన్ని!

మాలపున్నమనాడు కమురాసన
శ్రీరామనవమికి పానకం వాసన
హొలీకి రంగులాసన
ఉగాదికి పచ్చడాసన
ఒకటేమిటి సంవత్సరపోడుగునా
ఎన్ని కమ్మనైనాసనలు పీలుస్తామో?

కానీ...
ఒక్క కమ్మటి మాట నోట రాకుందే?
అమ్మా అనే కమ్మనిమాట
నీయమ్మాలా బూతులా మారుతూ...
ఎన్ని అల్లకల్లోలాలను సృష్టిస్తున్నామో?

– కుంచె శ్రీ
9908830477

## తెలంగాణ పాలిటిక్స్ అన్నీ దుబ్బాకకి లింక్

మెదక్ ,అక్టోబరు 26, ప్రజాపాలన:దుబ్బాక దుబ్బాక దుబ్బాక. తెలంగాణ పాలిటిక్స్ అన్నీ దుబ్బాకకి లింక్ అయ్యి తిరుగుతున్నాయి. అన్ని పార్టీలూ సీరియస్ గా తీసుకున్నాయి. ఇక్కడ ఓడిపోతే ఇజ్జత్ మే సవాల్ అంటున్నారు లీడర్లు. ఓడిపోవడమే కాదు. ఒక్కో ఓటు లెక్కే. ఓటు ఓటునీ కౌంట్ చేస్తూ కరెన్సీ కట్టలు కురిపిస్తున్నారట. ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదు అని లెక్కలేస్తున్నాయట పార్టీలు. అన్నొస్తయ్ ఇన్నొస్తయ్ అని లైట్ తీసుకోకుండా.. సీరియస్ గా కౌంటింగ్స్ లోకి వెళ్తూ.. కరెన్సీ కట్టలతో బ్యాగులు రెడీ చేస్తున్నారట. ఎలక్షన్లకి రెండు రోజుల ముందు లక్ష్మీ దేవి మొత్తాన్ని టేకోవర్ చేయబోతుందని టాక్. ఆల్రెడీ వర్గాల వారీగా బ్యారాలు నడుస్తున్నాయట. దసరా గిసరా అని ఏం చూడట్లేదు లీడర్లు. ఇది కూడా ఓ విధంగా కలిసొస్తుందంట. అందరూ గుంపులుగా కలవడం.. పండగ సందర్భంగా మాట్లాడుకోవడం.. ఇదే టైంలో బ్యారాలు కూడా తెగ్గొడుతున్నారట. మీ వర్గానికి అన్ని ఓట్లున్నయ్ ఆ వర్గానికి ఇన్ని ఓట్లున్నయ్.. అక్కడ అది చేస్తం ఇక్కడ ఇది చేస్తం. ఇన్ని డబ్బులిస్తం అలా చేస్కోండి అన్ని డబ్బులిస్తం ఇలా చేస్కోండి అని పార్టీలు కొనేస్తున్నాయట. పండగ పూట మంచి మాటలు మాట్లాడుకుందాం. మీది ఏ పార్టీ అయినా ఈ ఒక్కసారికి మర్చిపోండి. మా పార్టీకే ఓటేయండి అని అన్ని పార్టీలూ రిక్వెస్టులు చేస్తున్నాయట. కొన్ని చోట్లనైతే లోకల్ లీడర్లు బెదిరింపులకి కూడా దిగుతున్నారట. గెలిచిన తర్వాత మీకుందే అంటున్నారట. డబ్బులతో ప్రలోభ పెట్టడం.. అంగ, అధికార బలంతో బెదిరించడం అన్నీ నడుస్తున్నాయట. ఇక పార్టీలకి కూడా వేరే చోట ఎలక్షన్ లేకపోవడం. సీనియర్ లీడర్లు.. రెస్పాన్సిబులిటీ ఉన్న లీడర్లు ఫుల్లుగా ఫోకస్ చేయడంతో రసవత్తరంగా మారింది ఎవ్వారం. రూలింగ్ పార్టీని ఓడిస్తేనే దారికొస్తారు. లేదంటే హామీలు మర్చిపోతారు అని అపొనెంట్ పార్టీలు. రూలింగ్ లో ఉన్న పార్టీని గెలిపించి.. నియోజకవర్గాన్ని బాగు చేసుకోవాలని వీళ్లు. అందరూ ఎవరి ప్రచారాల్లో వాళ్లున్నారు. ఈ సాయంత్రానికి చాలా చోట్లకి ఎర్రకాయితాల బ్యాగులు ట్రాన్స్ పోర్ట్ అవుతున్నాయనేది టాక్.

## సంగంబండ రిజర్వాయర్...ఇళ్లు జీవన్మరణ సమస్య

మెదక్ ,అక్టోబరు 26 ప్రజాపాలన:మక్తల్ మండలం భూత్పుర్‌ను 2010 నవంబర్ 3న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ముంపు గ్రామంగా ప్రకటించింది. ఈ మేరకు జీఓ 122ను జారీ చేసింది. సంగంబండ రిజర్వాయర్ కట్టకు ఆనుకునే ఈ గ్రామం ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీటినిల్వ పెరిగి గ్రామంలో ఎక్కడ చూసినా ఊటలు కనిపిస్తున్నాయి. అప్పట్లో భూములకు తక్కువ ధర ఇచ్చినా, ఇళ్లకు మాత్రం ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. ఉన్న భూములు కోల్పోయి, పునరావాసం గ్రామం ఏర్పాటుకాక, రిజర్వాయర్ సమీపంలో ఇళ్లు ఉండటం తమకు జీవన్మరణ సమస్యగా మారిందని వారు వాపోతున్నారు. ఇళ్లలోకి ఊట వస్తోందని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని భూత్పుర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గ్రామం కోసం ఆర్‌ఆర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు 2015లోనే స్థలం ఎంపిక చేసినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. తేమ అధికంగా ఉండటంతో చివరకు పంటలు సైతం పాడైపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇక మాగనూర్ మండలం నేరడుగాంలోని కొన్ని ఇళ్లలో సంగంబండ రిజర్వాయర్ ఆయకట్టు కింది నుంచి ఊట నీరు వస్తోంది. దీంతో 5, 6వ వార్డుల్లోని సుమారు 30 ఇళ్లలో ఈ నీరు చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాన్ని పునరావాస కేంద్రంగా ప్రకటిస్తామని 2010లోనే అధికారులు సర్వే చేసి వదిలేశారు. ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్ట లేదని విమర్శిస్తున్నారు. వెంటనే పునారావసం కల్పించకపోతే ప్రమాదాలు జరిగి ఆస్తితో పాటు ప్రాణనష్టం వాటిల్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలి వర్షాలతో సంగంబండ రిజర్వాయర్ నిండింది. మా గ్రామం రిజర్వాయర్ కట్టకు దగ్గరలోనే ఉంది. దీంతో ఇళ్లలో ఊట వస్తోంది. నెల రోజులుగా వస్తున్న ఊట నీటిని బకెట్లు, కడవలతో ఎత్తిపోసినా ఫలితం లేదు. వారం రోజుల పాటు రెండు మోటార్లు పెట్టాం. ఐదేళ్ల కింద అధికారులు వచ్చి చూసి వెళ్లారు.

## ఆసుపత్రి కంటే ఇల్లే పదిలం.. ముఖం చాటేస్తున్న రోగులు




హైదరాబాద్,అక్టోబరు 26 ప్రజాపాలన:కొవిడ్ ఉధృతి బాగా తగ్గుముఖం పట్టినందున తెలంగాణలో కొవిడ్ చికిత్సకు అనుమతుల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే ప్రైవేటు ఆస్పత్రులకు ఇకపై అనుమతి ఇవ్వకూడదని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. జిల్లాల నుంచి ఇప్పటికే పలు ప్రైవేటు ఆస్పత్రులు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వాటిని ప్రభుత్వం పెండింగులో ఉంచింది. ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా ఉధృతి తగ్గడం, ఉన్న ఆస్పత్రుల్లోనే బెడ్లు ఖాళీగా ఉంటుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది.ఇప్పటికే అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు కొన్ని ప్రైవేటు ఆస్పతులకు కూడా ప్రభుత్వం కొవిడ్ చికిత్సకు అనుమతులు ఇచ్చింది. రాష్ట్రంలో క్రమంగా పరిస్థితులు మెరుగుపడి.. పాజిటివ్ కేసులు బాగా తక్కువగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో ఆస్పత్రులకు వచ్చి చికిత్స తీసుకునే వారి సంఖ్య కూడా బాగా తగ్గిపోయింది. దీంతో.. ఇక కొవిడ్ చికిత్సకు అదనపు ఆస్పత్రుల అవసరం ఉండదని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. ఆస్పత్రులు కిటకిట. బెడ్డు కావాలంటే రెకమండేషన్లు.. లక్షల్లో డిపాజిట్లు.. అడ్వాన్స్ బుకింగులు. బెడ్డు దొరకడమే మహాద్భాగ్యం. ఇదీ.. నిన్నటి వరకు రాష్ట్రంలో కొవిడ్‌కు చికిత్స అందించే ప్రైవేటు ఆస్పత్రుల్లోని స్థితి. దీంతో.. కొవిడ్ చికిత్సకు అనుమతుల కోసం ప్రైవేటు ఆస్పత్రులు పోటీపడ్డాయి. కానీ.. నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కొవిడ్ ఆస్పత్రులన్నీ వెలవెలబోతున్నాయి. బెడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రైవేటే కాదు.. ప్రభుత్వాసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి. దీనికి రాష్ట్రంలో కరోనా ఉధృతి తగ్గడం ఓ కారణమైతే.. వైరస్ సోకిన వారు కూడా ఆస్పత్రి కంటే ఇల్లే పదిలం అనుకోవడం మరో కారణం. ఈ స్థితిలో.. కొవిడ్ చికిత్సకు కొత్తగా ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పాజిటివ్‌లు తగ్గుతుండడంతో ప్రైవేటు ఆస్పత్రులు క్రమంగా పడకల సంఖ్యను కూడా తగ్గించేస్తున్నాయి. కొన్ని ఆస్పత్రులు కొవిడ్ చికిత్స నుంచే వైదొలగుతున్నాయి. వైరస్ ఉధృతి అధికంగా ఉన్న రోజుల్లో ప్రైవేటు ఆస్పత్రులు భారీగా కొవిడ్ చికిత్సకు అనుమతులు పొందాయి. సెప్టెంబరు 1 నాటికి రాష్ట్రంలో మొత్తం 184 ప్రైవేటు ఆస్పత్రులు కొవిడ్ చికిత్స అందిస్తుండగా, అక్టోబరు 1 నాటికి ఆ సంఖ్య 231కి చేరింది. కానీ.. అక్టోబరు 1 నుంచి రాష్ట్రంలో కరోనా ఉధృతి తగ్గుముఖం పట్టింది. ప్రైవేటు ఆస్పత్రులన్నీ క్రమంగా ఖాళీ అయిపోయాయి. దీంతో.. 20 రోజుల వ్యవధిలో మూడు ప్రైవేటు ఆస్పత్రులు కొవిడ్ చికిత్స నుంచి వైదొలగగా.. ఆస్పత్రులన్నీ కలిపి మొత్తం 529 కరోనా బెడ్లను తొలగించాయి. ప్రస్తుతం ప్రైవేటులో దాదాపు 80 శాతం బెడ్లు, సర్కారు ఆస్పత్రుల్లో 83 శాతం పడకలు ఖాళీగా ఉన్నాయి. అక్టోబరు 23 నాటికి రాష్ట్రంలోని 228 ప్రైవేటు కొవిడ్ ఆస్పత్రుల్లో మొత్తం 8,945 కరోనా బెడ్లు ఉండగా, అందులో 7,199 ఖాళీగా ఉన్నాయి. 61ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొత్తం 8,561 పడకలుంటే.. అందులో 7129 బెడ్లు ఖాళీగానే ఉన్నాయి. కరోనా చికిత్సకు ప్రత్యేక వ్యవస్థలతో పాటు నిపుణులైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కూడా ఉండాలి. వారికిచ్చే వేతనాలు కూడా భారీగానే ఉంటున్నాయి. రోగుల రాక తగ్గిపోయి.. ఆదాయం లేకపోతుండడంతో నిర్వహణ కూడా భారమవుతోందని ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకుడు తెలిపారు. అందుకే కొవిడ్ చికిత్స నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు.

## ఎలాంటి దరఖాస్తు అయినా కేవలం 15నిమిషాలలోపే

హైద్రాబాద్,అక్టోబరు 26 ప్రజాపాలన :ఏదైనా అప్లయ్ చేయాలన్నా.. సర్టిఫికెట్ కావాలన్నా మనకు ముందుగా గుర్చొచ్చేది మీ సేవ. మరి అది ఎక్కడుందో? దరఖాస్తుకు ఎంత టైం పడుతుందో? దేనికెంత చార్జీ వేస్తారో? అసలు మీ సేవ తెరచి ఉందో.. వర్కింగ్ డేనా హాలిడే నా? ఇలా అనేక సందేహాలతో తికమకపడుతుంటాం. ఇక ఆ ఇబ్బందులన్నింటినీ తీర్చింది తెలంగాణ ప్రభుత్వం. మీసేవ 2.0 'సిటిజన్ సర్వీస్' ద్వారా స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ సాయంతో మీ ఇంటినుంచే అన్ని సేవల్ని పొందే వెసులుబాటు కల్పించింది. కేవలం ఇంటర్నెట్ ఉంటే చాలు సేవల్ని సులభంగా, వేగంగా పొందవచ్చు. మీసేవ దరఖాస్తులు ఇక సొంతంగా చేసుకునే వెలుబాటును తెలంగాణ ప్రభుత్వం కల్పించింది. గత ప్రభుత్వాల హయాంలో కేవలం కియోస్క్ ఆపరేటర్ల(మీసేవ నిర్వాహకులు), డిపార్టమెంట్ లాగిన్‌ల ద్వారా మాత్రమే సర్టిఫికెట్లు దరఖాస్తు చేసేవారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక మీసేవలో సిటిజన్ సర్వీస్‌ను పొందుపర్చింది. దీంతో సిటిజన్స్(పౌరులు) ఎవరైనా మీసేవ ద్వారా తమకు కావాల్సిన అన్ని రకాల సర్టిఫికెట్లకు తమ మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా ఇంటి నుంచే ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు.ముందుగా సైట్ ఓపెన్ చేయాలి. అక్కడ మెనూలో లాగిన్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే 'మీసేవ 2.0' కనిపిస్తుంది. ఇక్కడ లాగిన్ అయ్యేందుకు మెనూ వస్తుంది. కియోస్క్ ఉన్న చోట క్లిక్ చేస్తే కియోస్క్, సిటిజన్, డిపార్ట్‌మెంట్ ఇలా మూడు రకాల ఆప్షన్లను చూపిస్తుంది. మనం 'అమిఎజిఇఔ'ను ఎంపిక చేసుకోవాలి. సిటిజన్ సర్వీస్‌ను ఎంచుకున్న తర్వాత కింద ఉండే ఔవలి జబవతీ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఆ తర్వాత ప్రొఫైల్ క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది. లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, కాంటాక్ట్ ఇన్ఫర్మేషన్ తదితరాలను అందులో పొందుపరిస్తే మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ ఒకసారి ఎంటర్ చేస్తే చాలు. ఇక మనం ఎల్లప్పుడూ మనకు కావాల్సిన సర్టిఫికెట్లను దరఖాస్తు చేసుకునేందుకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ జనరేట్ అవుతుంది. ఇలా లాగిన్ అయి టీఎస్‌ఆర్‌టీఏ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, టీఎస్ఎస్పీడీసీఎల్, పోలీస్, ప్రింట్ ఆప్షన్లు కనిపిస్తాయి. రెవెన్యూ ఆప్షన్‌లోకి వెళ్లగానే ఆపద్భంధు స్కీం, ఎక్స్‌ట్రాక్ట్ ఆఫ్ హౌస్‌సైట్ పట్టా, చిన్న, సన్నకారు రైతు సర్టిఫికెట్, బ్రాహ్మణ కుల ధ్రువీకరణ పత్రం, నివాసం, కులం, పుట్టినతేదీ, పొజిషన్, నివాసం, ఫ్యామిలీ మెంబర్, ఈబీసీ, నో ఎర్నింగ్ మెంబర్, ఆదాయం, ఓబీసీ, వ్యవసాయ ఆదాయ ధ్రువీకరణ పత్రం, వెనుకబడిన తరగతులకు చెందిన వర్గం వంటి పత్రాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేకాకుండా సర్టిఫైడ్ కాపీలు, నూతన వ్యవసాయ, తాగునీటి బావులు, నో అబ్జెక్షన్, ఎఫ్‌లైన్ పిటీషన్, ల్యాండ్ కన్వర్షన్(భూమి స్వభావం మార్పు), లేట్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్(పుట్టిన తేదీ), పేరు మార్పు, వ్యవసాయ భూమి విలువ వంటి ఎన్నోరకాల సర్టిఫికెట్లకు కూడా ఇక్కడే దరఖాస్తు చేసుకోవచ్చు.పోలీస్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే మిస్సింగ్ ఆర్ లాస్ట్ డాక్యుమెంట్స్ (పోగొట్టుకున్న డాక్యుమెంట్లు), ఈవెంట్ బందోబస్తు, పోలీస్ చలాన్ పేమెంట్స్, ఫ్రెష్ లైసెన్స్ లేదా రెన్యువల్ ఆప్షన్లు ఉంటాయి. ఇందులో బార్లు, దాబాలు, త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లు, సాధారణ రెస్టారెంట్లు, హోటళ్లకు నూతన, రెన్యువల్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేకాకుండా పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలు నిర్వహించేందుకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలైనా, అనుమతులైనా నట్టింట్లో నుంచే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ప్రతి పౌరుడికీ ప్రభుత్వం కల్పించింది.'మీసేవ' లోగో కింద 'సులభంగా.. వేగంగా' అని ఉంటుంది. ఈ పదం సేవలు వినియోగించుకునే వారికి సరిగ్గా సరిపోతుంది. ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ప్రతీ కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్‌ఫోన్ నుంచి సులభంగా ఎవరికి కావల్సిన సర్టిఫికెట్ వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేకాకుండా ఎలాంటి దరఖాస్తు అయినా కేవలం 15నిమిషాలలోపే దరఖాస్తు చేసుకోవచ్చు. తక్కువ సమయంలోనే తమ అవసరాన్ని బట్టి ఏది కావాలంటే అది ఇందులోనుంచే పొందే వీలు కల్పించారు. ఇలా చేయడం వల్ల ఇంటినుంచే అన్నిరకాల దరఖాస్తులు చేసుకోగా అధికారులు ఆ దరఖాస్తులను విచారించి ధ్రువీకరణ, లేదా తిరస్కరణ వంటివి చేస్తా రు. ధ్రువీకరించిన సర్టిఫికెట్లను సమీపంలోని మీసేవకు వెళ్లి తీసుకోవచ్చు.

## ఓఆర్ పడిపోవడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు



వరంగల్ ,అక్టోబరు 26 ప్రజాపాలన: ఆర్టీసీ సమ్మె అనంతరం అధికారుల ప్రవర్తనలో వచ్చిన మార్పు కార్మికులకు సంకటంగా మారింది. కరోనా వైరస్‌తో రెండు నెలలు ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. దాంతో కార్మికులు కష్టాల ఊబిలో కూరుకుపోయారు. సర్వీసులు తగ్గడంతో కార్మికులు స్పేర్ (అదనపు సిబ్బంది)గా ఉండాల్సి వచ్చింది. వారికి మస్టర్ ఇవ్వాల్సి ఉన్నా అధికారులు ఇవ్వకుండా లీవ్‌లో వెళ్లమనడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోనున్నారు. ఇదంతా టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో కార్మికుల దైన్యస్థితి. అంతేకాదు, సర్వీసులు తిరక్క అక్యుపెన్సీ తగ్గడంతో కాంట్రాక్టు కార్మికులను తొలగించి ఆఫీస్ వర్క్‌ని కూడా కార్మికులతోనే చేయిస్తున్న పరిస్థితి. కోవిడ్ అనంతరం సర్వీసులు ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు వరంగల్-2 డిపోలో డ్యూటీ ఛార్ట్‌లో కార్మికులు సంతకాలు పెట్టకుండా డిపో మేనేజర్ అడ్డుకోవడం గమనార్హం. వరంగల్ ఆర్టీసీ రీజియన్‌లోని 9 డిపోల్లో 4,085 మంది కార్మికులున్నారు. 712 బస్సులుండగా, 380 అద్దెబస్సులున్నాయి. ప్రతిరోజు 7,280 ట్రిప్పులు బస్సుల ద్వారా 10 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతుంది. కోవిడ్‌తో అద్దె బస్సుల్లో 25శాతం మాత్రమే తిరుగుతున్నాయి. అంతర్రాష్ట్ర సర్వీసులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో 42 సర్వీసులు, 'వజ్ర' 15 సర్వీసులు నడవడం లేదు. దాంతో పలువురు కార్మికులు స్పేర్‌లో ఉండాల్సి వస్తోంది. ఆర్‌టీసీ నిబంధనాల ప్రకారం స్పేర్‌లో ఉంచిన కార్మికుడికి విధుల్లోకి యాజమాన్యం పంపించలేని పక్షంలో సదరు కార్మికుడికి మస్టర్ ఇవ్వడమో లేదా మరో డ్యూటీ ఇవ్వడమో చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు మాత్రం మస్టర్ సైతం ఇవ్వకపోగా కార్మికులతో బలవంతంగా లీవ్ పెట్టిస్తున్నారు. దాంతో కార్మికులు ఈఎల్స్‌ను కోల్పోతున్నారు. రిటైర్మెంట్ అనంతరం వచ్చే బెనిఫిట్స్‌ని కోల్పోవాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాక్‌డౌన్ అనంతరం సర్వీసులు ప్రారంభమైన మే 19 నుంచి నేటి వరకు 3 రోజులు డ్యూటీలు ఇస్తే, 3 రోజులు డ్యూటీలు ఇవ్వడం లేదని, స్పేర్‌లో ఉంచినా మస్టర్ ఇవ్వడం లీవ్ మాత్రమే ఇస్తున్నారనీ కార్మికులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రమంతా దాదాపు ఇదే పరిస్థితిని ఆర్‌టీసీ కార్మికులు ఎదుర్కొంటున్నారు. వరంగల్-2 డిపోలో లాక్‌డౌన్ అనంతరం మే 19వ తేదీ నుంచి నేటి వరకు డ్రైవర్లు, కండక్టర్లను కోవిడ్ నెపంతో డ్యూటీ ఛార్ట్‌లో సంతకాలు పెట్టనివ్వకపోవడం వివాదాస్పదంగా మారింది. ఇక్కడ 500 మందికిపైగా కార్మికులున్నారు. వారంతా డ్యూటీలు చేస్తున్నా లీవ్ వేశారు.రీజియన్‌లో ఆక్యుపెన్సీ రేషియో పడిపోవడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించి వారి స్థానంలో కార్మికులతోనే ప్రస్తుతం పనిచేయిస్తున్నారు. 12 మంది టైపిస్టులు, 27 మంది పార్కింగ్ డ్రైవర్లు, ఆయిల్ బంకుల్లో 39 మంది, కార్గోలో 75 మంది, సెక్యూరిటీ, గ్యారేజీల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించి వారి స్థానంలో ఉన్న కార్మికులతో నియమించి పనులు చేయిస్తున్నారు. కోవిడ్ నేపథ్యంలో ఆర్టీసీ సర్వీసులు తగ్గడంతో ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా తగ్గింది. 712 ఆర్టీసీ బస్సులతోపాటు అద్దె బస్సుల్లో కేవలం 25 శాతం అంటే 90 బస్సులను మాత్రమే నడుపుతున్నారు.

## తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మినిట్స్ కాపీలు





హైద్రాబాద్,అక్టోబరు 26 ప్రజాపాలన :కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులను తన నియంత్రణలోకి తెచ్చుకునేలా తుది ముసాయిదా నోటిఫికేషన్‌ను ఆ నదీ జలాల బోర్డు సిద్ధం చేసింది. ప్రాజెక్టులు, వాటి పరిధిలోని ఉద్యోగులు బోర్డు అధీనంలోనే పని చేసేలా రూపొందించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం కేంద్రానికి పంపింది. దీన్ని కేంద్రం ఆమోదిస్తే.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులు కూడా బోర్డు పరిధిలోకి రానున్నాయి. ఇప్పటికే బోర్డు పరిధిని ఖరారు చేసే అధికారం రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తమకుందని కేంద్రం కరాఖండిగా చెప్పిన నేపథ్యంలో త్వరలో ఈ ఆమోదం ఉండొచ్చని తెలుస్తోంది.కృష్ణా బేసిన్ పరిధిలో తెలంగాణ, ఏపీలు కొత్తగా చేపట్టిన, చేపట్టనున్న అన్ని ప్రధాన ప్రాజెక్టులను తన పరిధిలోకి తెచ్చుకునేందుకు బోర్డు ఎప్పటినుంచో యత్నాలు చేస్తోంది. జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వీలుగా ప్రాజెక్టులను బోర్డు నియంత్రణలోకి తేవాలని కేంద్రానికి విన్నవించింది. దీనిపై కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడంతో శ్రీశైలం, సాగర్‌తో పాటు హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, ఏఎమ్మార్పీలను తమ పరిధిలోకి తెచ్చుకుంటామని తెలుపుతూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ను సిద్ధం చేసిన కృష్ణా బోర్డు ఇప్పటికే ఇరు రాష్ట్రాల అభిప్రాయాలు కోరింది. గతంలో వెలువరించిన ట్రిబ్యునల్ అవార్డులు, కుదిరిన ఒప్పందాలకు అనుగుణంగా నీటి కేటాయింపులు చేస్తామని స్పష్టం చేసింది. విద్యుదుత్పత్తిని సైతం తామే పర్యవేక్షిస్తామని పేర్కొంది. అయితే ఈ సమయంలోనే ప్రాజెక్టులపై బోర్డు నియంత్రణను తెలంగాణ గట్టిగా వ్యతిరేకించింది. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 85 ప్రకారం.. ప్రాజెక్టులను కేంద్రం నోటిఫై చేశాక, నీటి లెక్కలు తేలాక, బోర్డు వీటి నిర్వహణను మాత్రమే చూడాలని తేల్చిచెప్పింది. అయితే ప్రాజెక్టులను బోర్డు నియంత్రణలోకి తేవాల్సిందేనని ఏపీ ఎప్పటినుంచో కోరుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణ పరిధిలో ఉన్న కారణంగా ఆ రాష్ట్ర అధికారులు ప్రాజెక్టుపై పెత్తనం చేస్తున్నారని, తమ రాష్ట్రానికి నీరందించే కుడి కాల్వపై వారి పెత్తనమే కొనసాగుతున్న దృష్ట్యా బోర్డు నియంత్రణ అవసరమంటూ ఏపీ కేంద్రానికి లేఖలు సైతం రాసింది. ఇటీవల అపెక్స్ కౌన్సిల్ భేటీ అనంతరం సైతం మరో లేఖ రాసింది. తెలంగాణ రెండ్రోజుల కింద దీన్ని వ్యతిరేకిస్తూ బోర్డుకు ఘాటు లేఖ రాసింది. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు జరిగాకే నియంత్రణపై ముందుకెళ్లాలని, లేని పక్షంలో అడ్‌హక్‌గా ప్రస్తుతమున్న కేటాయింపులను మార్చి కృష్ణా జలాల పంపిణీని 50:50 నిష్పత్తిన దామాషాలో చేపట్టాలని కోరింది. అయితే వీటిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని బోర్డు.. కేంద్ర జల శక్తి శాఖ సూచనల మేరకు ప్రాజెక్టులను తన నియంత్రణలోకి తెచ్చుకు నేలా ముసాయిదా నోటిఫికేషన్ ను కేంద్రా నికి నివేదించినట్లు తెలిసింది. దీనిపై దసరా తర్వాత కేంద్రం నిర్ణయం చేయనుంది. అపెక్స్ కౌన్సిల్ భేటీకి సంబంధించిన మినిట్స్ కాపీలు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు చేరినట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. మినిట్స్‌లోని అంశాలను ముఖ్యమంత్రులు పరిశీలించాక తుది ఆమోదం ఇస్తూ సంతకాలు చేయాల్సి ఉంటుంది.

# ప్రైవేట్ ఉపాధ్యాయులకు చేయూత



**మధిర, అక్టోబర్ 26,** ప్రజాపాలన : కరోనా కారణంగా ప్రైవేట్ ఉపాధ్యాయులు పడుతున్న అవస్థలు గమనించిన ఉపాధ్యాయులు చేడే శ్రీనివాస్ మరియు అతని మిత్ర బృందం వారు నిర్వహిస్తున్న లిచిరు సహాయం సేవాలి కార్యక్రమంలో భాగంగా ఈరోజు స్థానిక ఎం ఆర్ సి భవనంలో మండల విద్యాశాఖాధికారి వై. ప్రభాకర్ చేతులమీదుగా దాతలు చేడే శ్రీనివాస్, తాళ్ళూరి సుబ్బారావు , మరియు విశ్రాంత ఉపాధ్యాయులు జి .ఎస్ .కెనడీ ,చేడే రామకోటేశ్వరరావు ల సమక్షంలో పదిహేడు మంది ప్రైవేటు ఉపాధ్యాయులకు ఇరవై వేల రూపాయలు విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేసి మానవత్వం చాటుకోవడం జరిగినది . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , మేడేపల్లి శ్రీనివాస్, సుగ్గల రామకృష్ణ మరియు వ్యాపారస్తుడు గార్లపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లితెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరంలి మధిర డీవిజన్ అధ్యక్షుడు లికోట వెంకట్‌లి మరియు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొల్చారం మండలంలో దసరా సంబరాలు

కొల్చారం అక్టోబర్ 25 ప్రజాపాలన: మండలంలోని వరిగుంతం, పోతంశెట్టి పల్లి, పైతర, వై మం దాపూర్, తుక్కాపూర్, యనగండ్ల మొదలైన గ్రామాలలో ఉదయం సమయంలో పాలపిట్ట ను చూసి వరి ధాన్యాన్ని తీసుకొని ఇంటి గుమ్మాలకు కట్టారు. సాయంత్రం సమయంలో జమ్మి చెట్టుకు పూజ చేసి గ్రామంలోని ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని కరోనా నేపథ్యంలో నమస్కారంతో ఆప్యాయతలను పంచుకున్నారు .తర్వాత గ్రామంలోని యువకులు బైక్ ర్యాలీతో ధ్వజారోహణం ఊర్లో నుండి హనుమాన్ టెంపుల్ వరకు తీసుకొని వచ్చి హనుమాన్ టెంపుల్ పైన పెట్టి స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమం అనంతరం హైదరాబాద్ నుండి బోధన్ వరకు జాతీయ రహదారి ఏర్పాటు చేస్తుండగా కొల్చారం గ్రామం బస్టాండ్ దగ్గర



అ రహదారి మధ్యస్తంగా బటర్ఫ్లై లైట్‌ను ఎమ్మెల్యే మదన్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఉమాదేవి రాజా గౌడ్, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, దసరా పండుగ రోజు సందర్భంగా ఈ లైట్లను స్విచ్ ఆన్ చేశారు తదనంతరం గ్రామంలోని ప్రజలు లైట్ల వెలుగుల్లో సంబరాలు జరుపుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎంపీటీసీ పల్వంచ అరుణ కృష్ణ గౌడ్, ఉప సర్పంచ్ చెన్నయ్య, చైర్మన్ మనోహర్, టి ఆర్ యస్ మాజీ మండల అధ్యక్షులు దేవన్న గారి శేఖర్, కండక్టర్ సంగమేశ్వర్ తెరాస నాయకులు ప్రవీణ్ కుమార్, తెరాస గ్రామ అధ్యక్షుడు చింతల యాదగిరి వార్డు మెంబర్లు సంఘమిత్ర యువకులు, కారోబార్ ప్రభాకర్, ర్యాగల్ల ఆనంద్, పల్వంచ రాజేంద్ర గౌడ్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ద్యాచారంలో బతుకమ్మ సంబురాలు



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26** ప్రజాపాలన : తెలంగాణ సంస్కృతికీ సాంప్రదాయాలకు నిలువెత్తు రూపం బతుకమ్మ. ప్రకృతికీ, మనిషికీ మధ్య ఉన్న సంబంధానికి ప్రతీక బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలందరూ గుమిగూడి, కూడలి ప్రాంతంలో బతుకమ్మలను ఉంచి బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా పాటలు పాడుతూ చప్పట్లే వాయిద్యాలుగా చేసుకొని చెవులకు ఇంపుగా పల్లె పాటలు వినసొంపుగా ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని పంచుతారు. అందులో భాగంగా జిల్లా పరిధిలోని వికారాబాద్ మండలానికి చెందిన ద్యాచారం గ్రామంలో బాపురం యాదమ్మ ఆధ్వర్యంలో మహిళలు దోమ నర్సమ్మ, గట్టేపల్లి నవనీత, విఒ దోమ సత్యమ్మ, బాపురం వెంకటమ్మ, బాపురం సుగుణమ్మ, గుట్టమీది లక్ష్మిలతో కలిసి సద్దుల బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. సాధారణంగా పూలతో దేవుడిని పూజించడం సంప్రదాయం కానీ పూలనే దేవుడిగా పూజించడం ఈ బతుకమ్మ పండుగ ప్రత్యేకం. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ బతుకమ్మ తొమ్మిది రోజులపాటు రంగురంగుల పూలతో కోన్ ఆకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మలను మధ్యలో ఉంచి చేరి చేతులు కలుపుతూ పాటలు పాడుతూ చప్పట్లతో తాళం వేస్తూ ఆడారు. అనంతరం గంగమ్మ ఒడిలో బతుకమ్మలను వదిలి నైవేద్యంగా పప్పుబెల్లాలను ప్రసాదంగా డీలర్ సత్తయ్య, మాజీ సర్పంచులు అనంతయ్య, నర్సిములు, ముష్టి లక్ష్మయ్య, టిఆర్ఎస్ నాయకుడు పాండులు ప్రసాద వితరణ చేశారు.

# మల్లాపూర్ మండలకేంద్రంలో వైభవంగా దసరా వేడుకలు



**మల్లాపూర్, అక్టోబర్ 26** ప్రజాపాలన: మల్లాపూర్ మండలం లో ఆదివారం దసరా వేడుకలు అంబరాన్నంటాయి. మహిషాసుర మర్దన,శమీ పూజలు, మహిళలు కొలాట నృత్యాలు, దుర్గా మాత నిమజ్జనోత్సవాలతో మల్లాపూర్ మండల ప్రజలు విజయదశమి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలో కనక దుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో జరిగిన దుర్గాదేవి నిమజ్జన ఉత్సవ సందర్భంగా ఎస్సై రవీందర్ మహిషాసుర మర్దన గావించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు ఆకుతోట రాజేష్,మర్రిపెల్లి మల్లయ్య, వనరక్షణ చైర్మన్ సిరిపురం రవీందర్, ముద్దం సత్యనారాయణ గౌడ్, తోట రవీందర్, నాంపల్లి మారుతి తదితరులు పాల్గొన్నారు

# పండుగలతో స్నేహభావం పెరుగుతుంది

## జిల్లా గ్రంథాలయ సంస్థ చూర్మన్ సనగారి కొండల్ రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 ప్రజాపాలన: పండుగలతో స్నేహ భావం పెరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్ రెడ్డి అన్నారు. ఆదివారం విజయదశమి దసరా పండగ సందర్భంగా మండలంలోని పంచలింగాల గ్రామంలో గ్రామస్థులతో కలిసి కోవిడ్ 19 నిబంధనలు పాటిస్తూ గ్రామ సమీపంలోని జమ్మి (షమీ) చెట్టు వద్దకు వెళ్లి పూజలు చేశారు. జమ్మి ఆకులను తెంపుకొని గ్రామంలోనీ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం భౌతిక దూరం పాటిస్తూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. కరోనా మహమ్మారిని పారద్రోలాలని ఆ దుర్గా మాతని వేడుకున్నారు. పండుగలు సంతోషంగా జరుపుకోవాలని పండుగలతో స్నేహ భావం పెరుగుతుందని ఈ సందర్భంగా కొండల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్, టిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సురేష్ కుమార్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నర్సింలు, తుక్కయ్య, గౌరయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మీర్పేట్ కార్పొరేటర్లు మంత్రికి దసరా శుభాకాంక్షలు



బాలాపూర్,ప్రజాపాలన : విజయదశమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్య శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డిని మరియు యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ఈ పవిత్రమైన దసరా విజయదశమి రోజు తెలం గాణ నాలుగు కోట్ల జనాభాకు శుభాకాంక్షలు తెలుపుతూ అదేవిధంగా మహేశ్వరం నియోజకవర్గం లోని మీర్పేట్ కార్పొరేషన్ టిఆర్ఎస్ నాయకులకు 2 కార్పొరేషన్ల ప్రజ లందరికీ జీవితం సుఖ సంతోషా లతో కరోనా పరిస్థితులు, అదేవి ధంగా హైదరాబాదులో కురిసిన భారీ వర్షాల వల్ల ఆస్తి నష్టం అవక తవకలు అయినా ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలిపిన సీనియర్ నాయకులు టిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు లావణ్య బీరప్ప, మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ టీఆర్ ఎస్ భూపాల్ రెడ్డి,, కార్పొరేషన్ కార్పొరేటర్లు వేముల నరసింహ్మా, ఇంద్రావత్ రవి నాయక్, బొక్క రాజేందర్రెడ్డి, జిల్లెల అరుణ ప్రభాకర్ రెడ్డి, గజ్జల రామ్ చందర్, విజయలక్ష్మి రాజు ముదిరాజ్, బీసీ సెల్ అధ్యక్షుడు దిండు భూపేష్ గౌడ్ , శివ పాల్గొన్నారు.

# మంత్రి కొప్పుల ఈశ్వర్ కు దసరా శుభాకాంక్షలు



వెల్గటూర్, అక్టోబర్ 26 ప్రజాపాలన: వెల్గటూర్ మండల తె.రా.స నాయకులు విజయదశమి సందర్భంగా తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో మండల తె.రా.స అధ్యక్షులు చల్లూరు రామచంద్ర గౌడ్, ఎస్.సి.సెల్ విభాగం అధ్యక్షులు కొప్పుల సురేష్, ఎండపల్లి సహకార సంఘం అధ్యక్షులు గూడా రామ్ రెడ్డి, సర్పంచ్ కొప్పుల విద్యాసాగర్, గాగి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, చుక్క శంకర్రావు ఉన్నారు.

# ఎమ్మెల్యేకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్లు





వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 ప్రజాపాలన శరన్నవ రాత్రులలో నిత్యపూజలతో భక్తులను ప్రసన్నులను చేసిన ఆది దేవత కాళికాదేవి. భక్తులు శ్రద్ధాసక్తులతో దైవ చింతనే పరమావధిగా కొంగుబంగారంగా కొలిచారు. భక్తుల మొక్కులను కళ్ళారగాంచుటకు రోజుకు ఒక అవతార రూపంలో దర్శన భాగ్యం కలిగించారు. భక్తుల మొక్కులను తీర్చుటకు రోజుకు ఒక అవతార రూపంలో దర్శన భాగ్యం కలిగించి పరవశింపజేసి కోరికలను తీర్చే ఆరాధ్య దైవంగా కొలిచారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ను కలిసి బంగారం ( జంబి ఆకులు)ను విజయదశమి సందర్భాన్ని పుర స్కరించుకొని ఇచ్చిపుచ్చుకొని శభాభివంద నాలు తెలిపారు. మా వార్డుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా సహాయసహకారం అందించుటకు సదా తోడ్పాటు అందించాలని కౌన్సిలర్లు చిట్యాల అనంత్ రెడ్డి, కుమ్మర్పల్లి గోపాల్ ముదిరాజ్, రత్లావత్ చందర్ నాయక్, మల్లేపల్లి నవీన్ కుమార్, శివారెడ్డిపేట్ పిఏసిఎస్ వైస్ చైర్మన్ గడ్డమీది పాండు ముదిరాజ్, టిఆర్ఎస్ నాయకులు దొడ్ల రాంరెడ్డి, మహిపాల్ కోరారు.

# ధన్యజీవి కమలమ్మ : ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి



పాలేరు ముదిగొండ, అక్టోబర్ 26 ప్రజాపాలన: ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వెంకటాపురం నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడే భర్త రాయల వెంకటేశ్వర్లు సహాదర్మచారిణిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చిన రాయల కమలమ్మ ధన్యజీవని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు సోమవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో రాయల కమలమ్మ చిత్ర పటానికి ఉపేందర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలమ్మ ఉత్తమ గృహిణిగానే కాకుండా ఇంటికి వచ్చిన వారికి కడుపు నిండా అన్నం పెట్టి దొడ్డా సీతమ్మ గా పేరుతెచ్చుకున్నారని కొనియాడారు. కమలమ్మ కుమారుడు గ్రానైట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు కు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య, కూసుమంచి ఎంపిపి బాణోత్తు శ్రీనివాస్, కూసుమంచి టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చాట్ల పరుశురాం, సిడిసి మాజీ చైర్మన్ నెల్లూరి లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆచారం ప్రకారం మహిళలు ఆనందం



బాలాపూర్, ప్రజాపాలన: బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బాలాపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వినోదంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి మహిళలను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... మహిళలు, ఆడపిల్లలు ఎంతో ఇష్టం గా ఆడే బతుకమ్మ ఆట ఈ సంవత్సరం ఎన్నో విపత్తులు వచ్చినా ఈ బతుకమ్మను ప్రతిష్టాత్మకంగా చేసుకునేందుకు ముందుకు వచ్చిన మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. విపత్తు కారణంగా కొంత మానసికంగా నిరుత్సాహ పడిన మహిళలకు, ఆడపడుచులకు మనో ధైర్యం, ఉత్సహం వస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు కాలనీవాసులు తదితరులు పాల్గోన్నారు.

# పేదల కోరిక తీర్చిన జర్నలిస్టు



**బాలాపూర్** , ప్రజాపాలన: బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14 డివిజన్ లోని వెంకటాపురం లో మంచినీళ్ల వాటర్ కు కాలనీ వాసులు చాలా ఇబ్బంది పడుతున్నారు నీ తెలుసుకొని, మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ సొంత డబ్బులతో ఎనిమిది వేల రూపాయలతో వాటర్ ట్యాంక్ ను కట్టించిన ఘనత అది సోమవారం నాడు బాలాపూర్ పోలీస్టేషన్ సీ.ఐ భాస్కర్ తో ప్రారంభించారు. కాలనీవాసులు మాట్లాడుతూ... వాటర్ కి ఇబ్బందిగా ఉంది అని సాంబశివను అడిగిన వెంబడే ఇలా తీర్చడం వల్ల చాలా సంతోషంగా ఉందని దుర్గ మాత ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు. కాలనీవాసులు సీ.ఐ కి, జర్నలిస్ట్ సాంబశివ కు, శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ పోలీస్ స్టేషన్ సీఐ భాస్కర్, స్థానిక కార్పొరేటర్ మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| తల్లనారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |

## మద్యం తాగితే మరణమే!



ఇది మద్యం తాగేవారందరికీ వర్తించే మాటే అంటున్నారు లండన్ పరిశోధకులు. మద్యం ఎక్కువ తాగితే గుండెనొప్పి, గుండెసంబంధిత వ్యాధులతో మృత్యువుకు చేరువవుతారంటున్నారు. సుమారు ఆరులక్షలమంది డ్రింకింగ్ హ్యాబిట్స్ మీదవీరు అధ్యయనం చేశారు. మద్యానికి మితంగా తీసుకుంటే గుండె ఆరోగ్యానికి మంచిదే అయినా దీర్ఘకాలంలో అదేవిషంగా మారే ప్రమాదముందని వారు హెచ్చరిస్తున్నారు. రోజుకి వందగ్రాముల స్వచ్ఛ ఆల్కహాల్‌ను వారంలో ఐదురోజుల పాటు తీసుకుంటే పెద్దగా ప్రమాదముండదనీ, అదే వారంలో పదిసార్లు మద్యం తాగేవారి ఆయుష్షు రెండు సంవత్సరాలు తగ్గిపోతుందనీ, అదే పద్దెనిమిది సార్లు తాగేవారి జీవితకాలం ఐదు సంవత్సరాలు తగ్గిపోతుదనీ వారు స్పష్టం చేస్తున్నారు.

## సిగరెట్ పొగతో గుండెకు చేటు



ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం. ఎక్కువగా సిగరెట్లు తాగడం, పొగాకు ఉత్పత్తులను వాడటం వల్ల ఊపిరితిత్తులు త్వరగా పాడవుతాయి.. రక్తపోటు వచ్చే అవకాశమూ ఉంది. అయితే పొగతాగడం వల్ల గుండెకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన సర్వేలో తేలింది. 55 ఏళ్లు పైబడిన వారిలో హృదయ స్పందనల రేటు సాధారణం కంటే 37శాతం ఎక్కువైనట్లు తమ పరిశోధనలో గుర్తించినట్లు తెలిపారు.

# ఆధునిక చికిత్సలతో రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ దూరం



రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ జీవితాన్ని నరకప్రాయం చేస్తుంది. ఈ సమస్యకు చికిత్స లేదనే అపోహ చాలా మందిలో ఉంటుంది. అందుకే పెయిన్ కిల్లర్స్ వేసుకుంటూ కాలం వెళ్లదీస్తుంటారు. సమస్య బాగా ముదిరిన తరువాత, కీళ్లు బాగా దెబ్బతిన్న దశలో డాక్టర్ దగ్గరకు పరుగెత్తుతారు. నిజానికి రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌ను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే సులభంగా బయటపడే అవకాశం ఉంటుందని అంటున్నారు రుమటాలజిస్ట్ డాక్టర్ ధీరజ్.

యుక్తవయస్సులో ఉన్న వారు, వయసు పైబడిన వారు అనే తేడా లేకుండా అందరినీ బాధిస్తోన్న సమస్య ఆర్థ్రైటిస్. అందులో ముఖ్యమైనది రుమటాయిడ్ ఆర్థ్రైటిస్. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకున్నట్లయితే ఎముకలకు నష్టం జరగకుండా, ఇతర సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు. అనేక పరిశోధనల ఫలితంగా రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌కు కొత్త మందులు అందుబాటులో వచ్చాయి. ఈ మందులతో కీళ్లు దెబ్బతినకుండా కాపాడే అవకాశం ఉంది. ప్రాథమిక దశలో గుర్తించడం, చికిత్స త్వరగా ఆరంభించడం, క్రమంతప్పకుండా మందులు వాడటం, వైద్యుల సలహా తీసుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, ఫిజియోథెరపీ, వ్యాయామం చేయడం వంటివి రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ నివారణలో చక్కగా ఉపయోగపడతాయి.

వ్యాధిని గుర్తించండిలా....

బిగుసుకుపోవడం : ఉదయాన నిద్ర లేవగానే అరగంట పాటు కీళ్లు బిగుసుకుపోయినట్లుగా ఉండటం జరుగుతుంది.

వాపు : కీళ్లల్లో ముఖ్యంగా చేతి కీళ్లలో వాపులు వస్తుంటాయి.

నొప్పి : కరచాలనం చేసినా, చేతిని ముట్టుకున్నా విపరీతమైన నొప్పి ఉంటుంది.

ఎవరిని కలవాలి?

రుమటాలజిస్ట్‌ను కలవడం ద్వారా సరియైన వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌కు ఏ విధమైన చికిత్స అందించాలనే విషయంలో రుమటాలజిస్ట్‌కు నైపుణ్యం ఉంటుంది. రుమటాలజిస్ట్ ఒక ఫిజీషియన్‌గా కీళ్ల నొప్పులపైనే దృష్టి పెట్టడం కాకుండా లింఫ్‌గ్రం?ధుల్లో వాపు, గుండె, ఊపిరితిత్తుల పైపొరలో వాపు, వాస్క్యులైటిక్ న్యూరోపతి, వాస్క్యులైటిక్ అల్సర్, ప్లీహం(స్ప్లీన్) పెద్దది కావడం వంటి ఇతర సమస్యలను పరిశీలిస్తారు. గుండె జబ్బులు వచ్చే అవకాశాలను అంచనా వేస్తారు. గుండె జబ్బులు, ఇన్‌ఫెక్షన్లు, శ్వాసకోశ సమస్యలు, ఆర్థ్రైటిస్ మూలంగా పురుషుల్లో ఏడేళ్లు, స్త్రీలలో మూడేళ్ల జీవితకాలం తగ్గిపోతోంది. అందుకే నిర్లక్ష్యం చేయకుండా కీళ్ల నొప్పులు బాధిస్తున్నట్లయితే రుమటాలజిస్ట్‌ను కలవాలి.

డాక్టర్‌ను కలిసిన తరువాత...

అవసరమైన పరీక్షలు చేసి, లక్షణాలు పరిశీలించిన తరువాత వైద్యులు తగిన మందులు సూచిస్తారు. అయితే మందులు తీసుకోవడంతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అప్పుడే వ్యాధి త్వరగా తగ్గడానికి అవకాశం ఉంటుంది.

మందులు వేసుకోవడం : కీళ్లు దెబ్బతినకుండా ఉండాలంటే వీలైనంత త్వరగా మందులు వాడటం మొదలుపెట్టాలి. మందులు వాడటం వల్ల సైడ్‌ఎఫెక్ట్స్ వస్తాయని భావిస్తుంటారు. కానీ రుమటాలజిస్ట్ అన్ని అంశాలను పరిగణలోకి తీసుకునే మందులు రాయడం జరుగుతుంది. కాబట్టి మందులు వేసుకోవడం మరవద్దు. నొప్పులు తగ్గాయని మందులు ఆపితే : మందులు వేసుకోవడం ప్రారంభించిన తరువాత కొద్ది రోజుల్లోనే నొప్పులు, వాపులు తగ్గుతాయి. మంచి రిలీఫ్ వస్తుంది. దాంతో ఇక మందులు అవసరం లేదని ఆపేస్తుంటారు. కానీ అది చాలా పొరపాటు. మందులు ఆపేయడం వల్ల తిరిగి వాపు, నొప్పి ప్రారంభమవుతుంది. ఆ తరువాత తగ్గడం చాలా కష్టమవుతుంది.

సొంత వైద్యం పనికి రాదు : ఒకసారి వైద్యుల దగ్గరకు వెళ్లి అవే మందులను దీర్ఘకాలం వాడటం వల్ల ప్రయోజనం ఉండదు. ఎందుకంటే వ్యాధి తీవ్రతను బట్టి మందులు వేసుకోవాల్సి ఉంటుంది. అందుకే వ్యాధి తీవ్రతను అంచనా వేయడం, మందులకు రెస్పాన్స్ వస్తున్న తీరు, మందుల వల్ల కలుగుతున్న దుష్ప్రభావాలు వంటివి డాక్టర్ పరిశీలించి మందులను సూచించడం జరుగుతుంది. కాబట్టి సొంత వైద్యం పక్కన బెట్టి క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

శారీరక వ్యాయామం తప్పనిసరి : సంపూర్ణ ఆరోగ్యానికి శారీరక వ్యాయామం బాగా ఉపయోగపడుతుంది. వ్యాయామం వల్ల కీళ్లలో ఫ్లెక్సిబులిటీ వస్తుంది. బిగుసుకుపోవడం తగ్గిపోతుంది.

స్మోకింగ్‌కు స్వస్తి చెప్పండి : పొగతాగే అలవాటు ఉంటే మానేయడం, నోరు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌తో గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గిపోతుంది.

డైట్ : రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ ఉన్న వారు ఆహార నియమాలు పాటించాలని లేదు. అయితే వారంలో రెండు రోజులు చేపలు తీసుకోవడం వల్ల కార్డియాక్ రిస్క్ తగ్గుతుందని పరిశోధనల్లో తేలింది. చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌ఉంటాయి. చేపలు ఇష్టం లేకపోతే వాల్‌నట్స్, సోయాబీన్స్ తీసుకోవచ్చు.

# ఆర్థ్రైటిస్‌తో అన్నీ సమస్యలే...

ప్రస్తుతం మన దేశంలో 15 కోట్లకు పైగా ప్రజలు ఆర్థ్రైటిసతో బాధపడుతున్నారు. ఒకప్పుడైతే 60 ఏళ్లు దాటాకే ఈ కీళ్లనొప్పుల సమస్యలు ఉండేవి. ఇప్పుడవి 30 ఏళ్ల నుంచే మొదలవుతున్నాయి. కాకపోతే ముందు నుంచే కొద్ది పాటి జాగ్రత్తల్ని తీసుకుంటే సమస్యను తగ్గించుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు..

ఏ భవంతిలోకి వెళితే ఏమిటి? ఆర్థ్రైటిస్ సమస్య ఉన్నవారికి మెట్లు కనబడితే చాలు కీళ్లు తెగిపడుతున్నట్లే అనిపిస్తుంది. ఆ క్రమంలో పిక్కలు తొడలు బిగదీసుకుపోతున్న భావన కలుగుతుంది.. కొద్ది రోజుల్లో కీళ్లల్లో ముఖ్యంగా తొంటి భాగంలో సూదులు గుచ్చినట్లు నొప్పి అనిపిస్తుంది. యుక్త వయస్కుల్లో చాలా మంది ఇంకా నాది చిన్న వయసే కదా ఈ కీళ్లనొప్పులు ఎందుకొస్తాయిలే అనుకుంటారు. అలా ఆ విషయమై నిర్లక్ష్యం వహిస్తారు. దీనివల్ల నేడు దేశంలోని కోట్లాది మంది కీళ్ల సమస్యలు విషమస్థితికి చేరుతున్నాయి. జీవితకాలం బాగా పెరిగిపోతున్న ఈ స్థితిలో చిన్న వయసులోనే కీళ్ల సమస్యలు మొదలైతే, ప్రతి కదలికలోనూ నరకమే కనిపిస్తుంది.

రెండేసి బాధ్యతలు

కీళ్లు ఏకకాలంలో పరస్పర విరుద్ధమైన రెండేసి బాధ్యత ల్ని నిర్వహించాల్సి ఉంటుంది. కీళ్లు అతి మృదువుగా ఉంటూ, సులువైన కదలికలకు అనువుగా ఉండాలి. అదే శరీరం బరువునంతా మోస్తూ స్థిరంగా కూడా ఉండాలి. కాకపోతే కీళ్ల మధ్య కీళ్లు సులువుగా కదిలేందుకు వీలయ్యే షాక్ అబ్‌సార్బర్స్ అంటే కార్టిలేజ్ ఉంటుంది. కీళ్ల మధ్య కొన్ని ద్రవాలు ఉత్పన్నం కావడం వల్ల కీళ్లు కదలికలో ఒరిపిడి ఏదీ జరగకుండా ఒక జిగట పదార్థం అందులో ఉంటుంది. అయితే, ఎముకల్లా కార్టిలేజ్‌లో రక్తనాళాలు గానీ, నరాలుగానీ ఏమీ ఉండవు. ఈ కారణంగా ఎప్పుడైనా కార్టిలేజ్ దెబ్బ తిన్నప్పుడు నొప్పి అనిపించదు. అలాగే దెబ్బ తిన్న కార్టిలేజ్ తిరిగి తనను తాను చక్కబరుచుకునే స్థితి కూడా ఉండదు. చాలా సార్లు కార్టిలేజ్ 40 నుంచి 50 శాతం వరకు దెబ్బ తినే దాకా ఏమీ అనిపించదు. సమస్య 60 శాతం దాకా చేరాకే నొప్పి తెలుస్తుంది. కాకపోతే ఆ నొప్పి తెలిసే నాటికి పరిస్థితి బాగా విషమించి ఉంటుంది.

ఆస్టియోఫైట్స్‌తో చిక్కు

సహజంగానే మనం వేసే ప్రతి అడుగులోనూ మన శరీరం బరువుకు మూడు రెట్లు కీళ్ల మీద, తొంటి భాగాల్లోనూ ఒత్తిడి పడుతుంది. ఈ ఒత్తిడి వల్ల కార్టిలేజ్ లోని నీరు ఎముకల మ?ధ్యలోకి వెళుతుంది. ఒకసారి ఒత్తిడి తొలగిపోతే కార్టిలేజ్‌లోని నీరు తిరిగి కార్టిలేజ్‌లోకి వెళుతుంది. చాలాసార్లు 40 నుంచి 55 ఏళ్ల లోపు వారిలో కాండ్రోసైట్ కణజాలం ఉత్పత్తులు తగ్గుతాయి.

దీనివల్ల దెబ్బతిన్న కార్టిలేజ్ తిరిగి చక్కబడటానికి చాలా ఎక్కువ కాలం పడుతుంది. ఆరోగ్యవంతమైన కార్టిలేజ్ చక్కబడటానికి దోహదం చేసే ప్రొటీన్ల ఉత్పత్తి తగ్గడంతో కొన్ని రకాల ఎంజైములు పెరిగిపోయి కార్టిలేజ్ మరింత దెబ్బ తినే పరిస్థితి ఏర్పడుతుంది. కార్టిలేజ్ కణాల ఉత్పత్తి తగ్గే సరికి దాని పెరుగుదల వేగం తగ్గిపోతుంది. ఆర్థ్రైటిక్ సమస్య తీవ్రమవుతున్న క్రమంలో కీళ్లల్లో అసహజమైన పెరుగుదల మొదలవుతుంది. శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. సినోవియల్ ఫ్లూయిడ్‌లోని తెల్ల రక్త కణాలు కీళ్లల్లోకి ప్రవేశించడంతో ఆస్టియోఫైట్స్ అనే హానికారక బొడిపెలు పెరగనారంభిస్తాయి. ఇవి కీళ్లకదలికల నడుమ రాపిడికి కారణమై కీళ్లనొప్పిని తీవ్రతరం చేస్తాయి. ఒక దశలో నడవడం మరీ కష్టమవుతుంది.

నివారించలేమా?

ఆస్టియో ఆర్థ్రైటిస్ నుంచి పూర్తిగా బయటపడే అవకాశాలు లేకపోవచ్చు. కాకపోతే కార్టిలేజ్‌ను గరిష్టంగా ఆరోగ్యంగా చూసుకునే అవకాశం ఉంటుంది.

ఎల్లవేళలా కీళ్లు సలువుగా కదిలేలా చూసుకోవాలి. వారికి తీవ్రస్థాయి ఒత్తిడి కీళ్లమీద, తొంటి మీద పడకుండా చూసుకోవాలి. మీ శరీరం ఏం చెబుతోందో ముందు గమనించండి.

విటమిన్–సి, డి లు తగ్గిపోవడం కూడా ఆర్థ్రైటిస్ పెరగడానికి కారణమవుతూ ఉంటుంది. మద్యం తీసుకునే అలవాటు ఉంటే అతి తక్కువ మోతాదులోనే తీసుకోవాలి.

కీళ్ల మీద భారం పడకుండా , తక్కువ మోతాదు బరువులను మాత్రమే మోయాలి. కీళ్ల సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే కండరాలను బలోపేతం చేయడం తప్పనిసరి.

భంగిమల మార్పు ఈ రోజుల్లో అతి ముఖ్యమైనది. ఉద్యోగ వ్యాపారాలు చేసే వారు ఎక్కువ గంటలు కూర్చునే ఉంటారు. అందువల్ల ప్రతి గంటకు ఒకసారైనా శరీరం అప్పటిదాకా ఉన్న భంగిమకన్నా భిన్నంగా ఉండేలా చూడాలి.

ఎముకల దారుఢ్యం కోసం కాల్షియం ఎక్కువగా ఉండే ఆకు కూరలు తప్పనిసరి తీసుకోవాలి.

# ఆధునిక సర్జరీలతో వెన్నుకు దన్ను

వెన్నెముకకు సంబంధించిన వ్యాధి అంటే ఒకప్పుడు ప్రాణభయంతో గిలగిలలాడే పరిస్థితి. సాంప్రదాయక సర్జరీలు చేయించుకుంటే వారాల తరబడి ఆసుపత్రిలో ఉండాల్సి రావడం, శరీరంపైన పొడవైన గాటు పడడం, దీంతో నొప్పి ఎక్కువ రోజులు ఉండడం వంటివి జరిగేవి. 'మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ' వల్ల ఈ సమస్యలన్నీ దూరమైపోయాయని, అతి చిన్న గాటుతో ఎండోస్కోపి విధానంలో జరిగే ఈ వెన్ను సర్జరీల సురక్షితమైనవి అంటున్నారు ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ జిపివి సుబ్బయ్య. వెన్నుకు సంబంధించిన అత్యంత అధునాతన సర్జరీగా మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ(ఎంఐఎస్ఎస్) ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. అతి చిన్న గాటుతో సర్జరీ చేయడం, తక్కువ కాలం ఆసుపత్రిలో ఉండడం, సర్జరీ అనంతరం ఎటువంటి దుష్ప్రభావాలు ఉండకపోవడం వంటి ఎన్నో ప్రయోజనాలు లభ్యమవుతున్న ఈ సర్జరీ ఇప్పుడు అత్యంత ప్రజాదరణ పొందిన సర్జరీగా చెప్పవచ్చు. వెన్నెముకకు సంబంధించిన అన్ని సమస్యలను ఈ సర్జరీ ద్వారా సులభంగా నయం చేయవచ్చు.

అత్యంత సురక్షితమైన సర్జరీ

మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ అత్యంత సురక్షితమైనది. ఈ సర్జరీని చాలా చిన్న గాటుతో చేస్తారు. పేషెంట్ చాలా శీఘ్రంగా కోలుకోవడం జరుగుతుంది. సర్జరీ తర్వాత ఎటువంటి దుష్ప్రభావాలు తలెత్తవు.

సూక్ష్మమైన ఒక చిన్న రంధ్రాన్ని వీపు కండరాల ద్వారా వెన్నెముక వరకు వేయడం జరుగుతుంది. దీని వల్ల కణజాలానికి ఎక్కువ నష్టం జరగదు. అదే సాంప్రదాయక సర్జరీలో కణజాలానికి చాలా నష్టం జరుగుతుంది.

సాంప్రదాయక సర్జరీలో వీపు భాగాన ఒక పెద్ద కోతను వేస్తారు. అదే ఎంఐఎస్ఎస్‌లో ఒకటి, లేదా రెండు చిన్న గాట్లులు వేస్తారు. అవి ఒక అంగుళం కన్నా తక్కువే ఉంటాయి.

సర్జరీ ఎలా చేస్తారు?

మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీని 'కీ హోల్ సర్జరీ'గా కూడా వ్యవహరిస్తారు. ఈ సర్జరీలో ఒక సూక్ష్మమైన టెలిస్కోప్(ఎండోస్కోప్ అంటారు)ను చిన్ని గాట్ల ద్వారా వెన్నెముక వద్దకు పంపిస్తారు. ఈ ఎండోస్కోప్‌నకు ఒక చిన్న వీడియో కెమెరాను జతచేస్తారు. దీని వల్ల పేషెంట్ శరీరంలోపలి భాగాన్ని ఆపరేషన్ రూమ్‌లోని టెలివిజన్ తెరల మీద చూడవచ్చు. నడుము బాగంలో అదనంగా అర అంగుళం పరిమాణంలో ఒకటి, రెండు రంధ్రాలను వేసి వాటి ద్వారా సర్జికల్ పరికరాలను శరీరంలోపలకు పంపిస్తారు. ఈ రంధ్రాలపై సర్జికల్ టేపులు వేయడం వల్ల ఏర్పడిన మచ్చలు కొద్ది నెలల్లోనే శరీరంపైన మాయమవుతాయి.

ప్రయోజనాలు

మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ ద్వారా వెన్నెముకకు సంబంధించిన సమస్యను శీఘ్రంగా, నిర్దిష్టంగా గుర్తించవచ్చు. సర్జరీ తర్వాత హాస్పిటల్‌లో తక్కువ రోజులు ఉండడం, త్వరగా కోలుకోవడం జరుగుతుంది. సర్జరీ కారణంగా కణజాలానికి నష్టం తక్కువ స్థాయిలో ఉంటుంది. దీని వల్ల నొప్పి కూడా తక్కువగా ఉంటుంది.

సర్జరీ తర్వాత ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తక్కువ. శరీరంపై గాటు సూక్ష్మంగా ఉంటుంది. దీని వల్ల త్వరగా గాయం మాని మచ్చ కూడా కనిపించకుండా ఉంటుంది.

సర్జరీ ద్వారా ఏర్పడే రక్తహీనత ఉండదు. దీంతో బలహీనపడే అవకాశం రాదు.

ఈ సర్జరీ తర్వాత మరుసటి రోజే హాస్పిటల్ నుంచి డిస్చార్జ్ కావచ్చు. అయితే కొన్ని కీలక సర్జరీల విషయంలో మాత్రం మూడు, నాలుగు రోజులు హాస్పిటల్‌లో ఉండాల్సి ఉంటుంది. ఐదు నుంచి పది రోజుల్లో పేషెంట్ విధులకు హాజరుకావచ్చు.

ఎవరికి ఈ సర్జరీలు అవసరం?

డిస్కులు జారడం లేదా పక్కకు జరిగినప్పుడు.



డిస్కులు అరిగిపోవడం, గాయపడడం లేదా స్పాండిలోలిస్తసిస్(ఒక వెన్నెముక మీద మీద మరో వెన్నెముక వాలడం) ఏర్పడినప్పుడు.

స్కోలియోసిస్ అంటే డిస్కుల లోపాలను సరిచేసినప్పుడు.

పక్కకు జరిగిన డిస్కులను తొలగించినప్పుడు.

అందరికీ ఈ సర్జరీ చేయవచ్చా?

మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీని పేషెంట్స్ అందరికీ చేయవలసిన అవసరం ఉండదు. ప్రతి పేషెంట్‌ను వ్యక్తిగతంగా పరీక్షించిన తర్వాత అవసరాన్ని బట్టి ఈ సర్జరీ చేయాల్సి ఉంటుంది.

## అరిగిన డిస్కులకు ఆయుర్వేదమే శరణ్యం

వెన్నునొప్పి మౌలికంగా ధాతుక్షయంతో ఏర్పడిన సమస్య. పెయిన్ కిల్లర్స్ ఇచ్చి ఆ నొప్పిని ఎన్నాళ్లని కప్పిపుచ్చుతారు. సర్జరీ చేసి ఏం సాధిస్తారు? మొత్తంగా వెన్నుముకను పరిపుష్ఠం చేయకపోతే, ఒక్కొక్క డిస్కూ అరిగి, ఒరిగిపోవడం తప్ప ఫలితమేమీ ఉండదు. ఏళ్ల తరబడి కొనసాగే వెన్నునొప్పి వల్ల వృత్తి సామర్థ్యాన్నే కాదు సహజమైన జీవశక్తినే కోల్పోతారు. అందులో భాగంగానే ఒక దశలో లైంగిక శక్తి కూడా అడుగంటిపోతుంది. ఇదంతా మొత్తంగా వెన్నెముకను బలోపేతం చేయకపోవడం వల్ల ఏర్పడిన దుర్దశ. ఆయుర్వేద వైద్యవిధానం ఇందుకు పూర్తిగా భిన్నమైనది. సప్తధాతువుల్నే కాకుండా మొత్తంగా వెన్ను వ్యవస్థనే శక్తివంతం చేసి వెన్నునొప్పి నుంచి సంపూర్ణ విముక్తిని కలిగిస్తుంది అంటున్నారు ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ వర్ధన్.

చెద లు పట్టిన మూలస్థంభంలా వెన్నెముక తయారైతే, మనిషికింక బతుకేముంటుంది? బతుకు, భవిష్యత్తుల మాటెందుకు గానీ, అసలు కదల్లేని స్థితి ఏర్పడుతుంది కదా! నొప్పిని భరించలేక కొందరు అదేపనిగా పెయిన్ కిల్లర్సు వేసుకుంటారు. ఇవి నొప్పి తెలియకుండా ఆ భాగాన్ని మొద్దుబరుస్తాయే తప్ప నొప్పిని తీసేయవు. పైగా వీటిని ఎక్కువకాలం అలా వాడుతూ ఉండిపోతే, పలురకాల జీర్ణాశయ సమస్యలు వస్తాయి. వాటిలో ముఖ్యంగా కడుపునొప్పి నుంచి అల్సర్‌దాకా, ఐబిఎస్ నుంచి రక్తస్రావం దాకా ఏమైనా రావచ్చు. కొందరిలో ఇవి మలబద్ధకాన్నీ, వాంతీ, వికార భావాల్నీ కలిగిస్తాయి. మగతనూ, మజ్జుతనాన్నీ నింపుతాయి. మరీ ఎక్కువ కాలం వాడితే ఇవి గుండె రక్తనాళాలనూ దెబ్బ తీయవచ్చు. రక్తం గడ్డకట్టుకుపోయేలా చేసి పక్షవాతానికి కూడా దారితీయవచ్చు. కొంతకాలం దాకా పెయిన్‌కిల్లర్స్‌ను అలా కొనసాగిస్తూ పోతే, ఒకదశలో వాటికి బానిసైపోయి రోజూ వేసుకుంటే తప్ప నిద్రపట్టని పరిస్థితి ఏర్పడుతుంది. కేవలం కొద్ది పాటి ఉపశమనాన్ని ఇచ్చే పెయిన్ కిల్లర్స్ శరీరాన్ని ఇన్నిన్ని దుష్పరిణామాల పాలు చేస్తాయి. స్టెరాయిడల్ షాట్స్ తీసుకున్న వారికి కూడా రెండు నుంచి ఆరునెలలే ఉపశమనంగా ఉంటుంది. నిజానికి మొత్తం జీవితకాలంలో రెండు, మూడు సార్లకు మించి వాటిని తీసుకోవడానికి వీలేలేదు. ఈ సైరాయిడ్స్ దుష్ప్రభావాల్లో కొన్ని స్వల్ప కాలికంగా ఉండిపోతే, మరికొన్ని దీర్ఘకాలికంగా ఉంటాయి. స్వల్పకాలికమైన వాటిలో ఇన్‌ఫెక్షన్లు లోనికి ప్రవేశించవచ్చు. అక్కడున్న కండరాలు, టెండాన్లు, లిగమెంట్లు దెబ్బతినిపోవచ్చు. దీర్ఘకాలిక దుష్ప్రభావాల్లో స్టెరాయిడ్స్ వల్ల శరీరం బరువు పెరుగుతుంది. వీటితో పాటే రక్తపోటు, షుగర్ నిలువలు కూడా పెరిగిపోయే ప్రమాదం ఉంది. స్టెరాయిడ్స్ వల్ల వ్యాధినిరోధక శక్తి కూడా తగ్గిపోయి శరీరం ఇన్‌ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంది. ఒకదాని తరువాత ఒకటిగా నిరంతరం శరీరం రోగగ్రస్తమయ్యే స్థితి ఏర్పడుతుంది.

సర్జరీతో ఏమవుతుంది?

ప్రపంచ ఆరోగ్య సంస్థే స్వయంగా చెప్పినట్లు, వెన్నునొప్పి బాధితుల్లో కేవలం 5 శాతం మందికే అంటే మలమూత్రాలు ఆగిపోయిన దశలో సర్జరీ అవసరమవుతుంది. మిగతా 95 మందికి సర్జరీ అవసరం లేదు. సర్జరీ కోసం డబ్బు భారీమొత్తమే ఖర్చవుతుంది. అయితే అంత ఖర్చు చేసి సర్జరీ చేయించుకుని కూడా ఆ తరువాత ఎంతో భారీ నొప్పిని భరించాల్సి వస్తోంది.డిస్కులన్నీ అరిగీ అరిగీ శిథిలావస్తకు చేరడమే ఇందుకు కారణం. వాస్తవానికి సర్జరీ లేకుండానే ఈ 95 శాతం వెన్నునొప్పి సమస్యలను నయం చేసే అవకాశాలు ఉన్నాయి. వెన్నునొప్పి కారణంగా సర్జరీ చేయించుకున్న వారినీ, చేయించుకోని వారినీ పరిశీలిస్తే ఓ ఐదేళ్ల తరువాత ఇద్దరిలోనూ నొప్పి పరిస్థితీ ఒకేలా ఉందని శాస్త్రీయ అధ్యయనాల్లోనే స్పష్టమయ్యింది.

ఆయుర్వేద విశేషం

వెన్ను చికిత్సల్లో చాలా వరకు సమస్య మూలాల్ని తెలుసుకుని చేసినవి కావు. పెయిన్ కిల్లర్స్ అయినా, స్టెరాయిడల్ షాట్స్ అయినా, చివరికి సర్జరీ అయినా ఎంతసేపూ బయటికి కనిపించే లక్షణాల్ని దృష్టిలో ఉంచుకుని చేసినవే. అందుకే అవి తాత్కాలిక ఉపవమనాన్నే ఇస్తున్నాయి. పైగా డిస్కులో సమస్యఉంది కాబట్టి ఆ డిస్కును మార్చేస్తే సరిపోతుందనుకుంటే అంతకన్నా పెద్ద పొరపాటు మరొకటి ఉండదు. అందుకే ఆ డిస్కు దెబ్బతినడానికి దారి తీసిన మొత్తం కారణాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే ఆయుర్వేదం మేరు చికిత్సకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. మేరుచికిత్స వెన్నునిర్మాణాన్నీ చక్కబరుస్తుంది. అదే క్రమంలో కడుపులోకి ఇచ్చే కొన్ని ఔషధాలు మొత్తం వెన్ను వ్యవస్థనే నిలబెడ తాయి. ఎవరికైనా వెన్ను సమస్యలు మొదలయ్యాయీ అంటే అస్థిధాతువులో లోపం ఏర్పడిందని అర్థం. అస్థిధాతువు అనేది దానికదిగా విడిగా ఏర్పడిన నిర్మాణం కాదు. రసధాతువు, రక్తధాతువు, మాంసధాతువు ఈ మూడూ శక్తివంతంగా ఉన్నప్పుడే అస్థిధాతువు స్థిరంగా ఉంటుంది. ఆ క్రమంలో లైంగిక శక్తికి మూలమైన శుక్రధాతువూ బలపడుతుంది. ఆయుర్వేద వైద్యంతో వెన్ను, సయాటికా సమస్యలు తొలగిపోవడానికి సప్తధాతువుల్నీ శక్తివంతంగా మార్చడమే కారణం. అనుబంధ వ్యవస్థల్నీ చక్కదిద్దే మూల వైద్యం చేయనిదే ఏ వ్యాధినుంచైనా ముక్తి లభించదు. వెన్నునొప్పి చికిత్సలో అది మరీ ముఖ్యం. వెన్నునొప్పికి ఒకవేళ అప్పటికే సర్జరీ జరిగి ఉంటే, వారు కూడా ఆయుర్వేద చికిత్సలు తీసుకుంటే మరోసారి ఆ సమస్య తలెత్తకుండా ఉంటుంది.




# చివరికి మిగిలేది దర్శకత్వమేనా స్టార్ డాటర్ కి?



బుచ్చిబాబు చివరికి మిగిలేది స్టోరీలా .. అన్ని శాఖల్లో విఫలమయ్యాక చివరిగా దర్శకులు కావాలని ఉందనేస్తారు. అదేదో ట్యాలెంట్ తో పని లేని వ్యవహారంలాగా కనిపిస్తుంటుంది. చాలామంది క్రియేటివ్ డైరెక్టర్లుగా ఎదిగేయాలని కలలు కంటూ .. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తుంటారు. ముఖ్యంగా నటీనటులు దర్శకులు అయ్యేందుకు నానా తపనా పడుతుంటారు. అయితే అది అయ్యే పనేనా? పూర్తిగా దర్శకత్వమే విజన్ గా ప్రయత్నిస్తే అది వేరు. వేరే చోట్ల ఫెయిలయ్యాక ఇది ఖాళీగా ఉందిలే అని వెతుక్కుంటూ వస్తే అది వేరే.

ఇప్పుడు అదే బాపతులో కలలుగనే చాలా మంది నాయికలు దర్శకులు కావాలనుకోవడం పరిశ్రమలో చర్చకు వచ్చింది. అన్నట్టు విశ్వనటుడు కమల్ హాసన్ గారాల పట్టీ అక్షర హాసన్ దర్శకురాలు కావాలనుకుంటోందట. తన కలల్ని నిజం చేసుకోవాలనుకుంటోందట. అక్షర హాసన్ తన తండ్రి అడుగుజాడలను అనుసరించి ఏదో ఒక రోజు దర్శకురాలు కావాలనుకుంటున్నానని.. తన కలను వెల్లడించారు. కమల్ మాదిరిగా.. అక్షర కూడా తన సృజనాత్మకతకు రెక్కలు తొడుగుతుందట. ఓవైపు నటిస్తూనే మరోవైపు ఆ రకంగానూ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోందట. అక్షర ప్రస్తుతం రెండు తమిళ సినిమాల్లో నటిస్తోంది. వాటి విడుదల కోసం వేచి చూస్తోంది. అగ్ని సిరాగుగల్ అనే ఇంటెన్సివ్ థ్రిల్లర్ ..ఏజ్డ్ డ్రామా.. అచ్చం మేడమ్ నానమ్ పయిర్చ్ఛు ఈ రెండు సినిమాలకు సంబంధించిన ప్రమోషనల్ పోస్టర్లు ఇప్పటికే రిలీజయ్యాయి. అవి ఆశించిన దానిని మించి సంచలనం సృష్టించాయి. అయితే కేవలం నటనతోనే అక్షర సంతృప్తి చెందేట్టు లేదు. ఈ రంగంలో ఆశించిన స్టార్ డమ్ అందకపోవడం వల్లనే దర్శకురాలు కావాలనుకుంటోందా? లేక స్వతహాగానే తండ్రి నుంచి అబ్బిన గుణమా? అంటూ జనం చెవులు కొరుక్కుంటున్నారు. అయితే ప్రాక్టికల్ గా దర్శకురాలై సత్తా చాటి చూపించడమే చెంప పెట్టు లాంటి సొల్యూషన్ అని చెప్పాలి. ఉబలాటం వేరు.. క్రియేటివిటీ వేరు అని ప్రూవ్ చేయాల్సి ఉంది.

# పవన్ కళ్యాణ్ కొత్త మూవీ టైటిల్ కెవ్వు కేకలే



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ టైటిల్ ఎంపిక సంథింగ్ స్పెషల్ అనే చెప్పాలి. గబ్బర్ సింగ్ .. సర్దార్ గబ్బర్ సింగ్.. పంజా .. కొమరం పులి.. ఇవన్నీ పవర్ ఫుల్ టైటిల్స్. జనంలోకి సులువుగా దూసుకు పోయిన టైటిల్స్ కూడా. ప్రస్తుతం వకీల్ సాబ్ అనే టైటిల్ తోనూ మరోసారి జనంలోకి దూసుకెళ్లాడు. మూవీ తర్వాత ఎక్స్ క్లూజివ్ టైటిల్ సెలెక్షన్ తో ఆకట్టుకుంటున్నాడు పవన్. ప్రస్తుతం పవన్ మల్లూ బ్లాక్ బస్టర్ అయ్యప్పనమ్ కోషియం రీమేక్ లో పోలీస్ పాత్రలో నటించేందుకు రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాని విజయ దశమి సందర్భంగా అధికారికంగా లాంచ్ చేశారు. అయితే టైటిల్ ని మాత్రం వెల్లడించలేదు. ఇన్ సైడ్ సోర్స్ ప్రకారం.. ఈ మూవీ టైటిల్ కెవ్వు కేక రేంజులో ఉంటుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బాగా పాపులరైన క్లాసిక్ టైటిల్ బిల్లా రంగా ను ఎంపిక చేశారని వినిపిస్తోంది. ఇక బిల్లా రంగా అంటే రెండు పాత్రలు కదా? ఆ రెండో పాత్ర కోసం ఎవరిని ఎంపిక చేయబోతున్నారు? అంటే దగ్గుబాటి రానా పేరును పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే రానాను దర్శకనిర్మాతలు సంప్రదించారట. అయితే అధికారికంగా ప్రతిదీ చిత్రబృందం వెల్లడించాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది రెగ్యులర్ షూట్ ప్రారంభమవుతుంది. మే 2021 లో విడుదల చేయాలన్నది ప్లాన్. ఈ చిత్రం మొత్తం షూట్ పొల్లాచిలో ఒకే షెడ్యూల్లో పూర్తి చేయనున్నా రని తెలుస్తోంది. ఇతర నటులు సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడించాల్సి ఉంటుంది. సాగర్ చంద్ర ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సితారా ఎంటర్ టైన్మెంట్స్ నిర్మించనుంది. వకీల్ సాబ్ చిత్రీకరణ ఈ నవంబర్ లో ముగించి తదుపరి క్రిష్ మూవీ సెట్స్ లో జాయిన్ అవుతాడు. అటుపై బిల్లా రంగా చిత్రీకరణను ప్లాన్ చేస్తారట.

# ప్రభాస్ ఫ్యాన్స్ నిరుత్సాహం



ప్రభాస్ హీరోగా రూపొందుతున్న 'రాధేశ్యామ్' సినిమా కోసం ఫ్యాన్స్ గత ఏడాది కాలంగా వెయిట్ చేస్తున్నారు. బాహుబలి... సాహోల సినిమాల స్థాయిలో ఈసినిమాను దర్శకుడు రాధాకృష్ణ చెక్కుతున్నాడు. ఈ సినిమా ఫస్ట్ లుక్ కోసం ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. చిత్ర నిర్మాణ సంస్థ అయిన యూవీ క్రియేషన్స్ వారిని ఒత్తిడి చేసి మరీ ఫస్ట్ లుక్ ను విడుదల చేసేలా చేశారు. ఇక ఇటీవల ప్రభాస్ బర్త్ డే సందర్భంగా రాధేశ్యామ్ టీజర్ వస్తుందని అంతా ఆశించారు. ఒక్క రోజు ముందు ఆర్ఆర్ఆర్ మూవీ నుండి రామ రాజు ఫర్ భీమ్ ప్రోమో విడుదల అయ్యింది. దాంతో రాధేశ్యామ్ టీజర్ కూడా విడుదల అవ్వడం ఖాయం అనుకుంటే యూనిట్ సభ్యులు మాత్రం నిరాశ పర్చారు. కేవలం మోషన్ పోస్టర్ ను విడుదల చేసి మమా అనిపించారు. టీజర్ కోసం వెయిట్ చేసిన అభిమానులు పండుగకు అయినా రాధేశ్యామ్ టీజర్ వస్తుందని భావించారు. కాని పండుగకు కూడా నిరాశే పర్చారు. పలు సినిమాల టీజర్ లు వీడియోలు పాటలు విడుదల అవుతున్న సమయంలో రాధేశ్యామ్ నుండి మోషన్ పోస్టర్ ను మాత్రమే విడుదల చేయడంతో చిత్ర యూనిట్ సభ్యుల అసమర్థత కనిపిస్తుంది అంటూ కొందరు కాస్త గట్టిగానే విమర్శలు కురిపిస్తున్నారు. చిత్ర యూనిట్ సభ్యులు మాత్రం సినిమా విడుదలకు ఇంకా సమయం చాలా ఉన్న కారణంగా ఇప్పటి నుండే టీజర్ ఎందుకు అన్నట్లుగా భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రభాస్ బర్త్ డే కు లేదా దసరాకు రాధేశ్యామ్ టీజర్ విడుదల అయ్యి ఉంటే రామరాజు ఫర్ భీమ్ వీడియోకు గట్టి పోటీ ఇవ్వడం జరిగేది. పండుగకు రెండు వీడియోలతో అభిమానులు మరియు ప్రేక్షకులకు విజువల్ వండర్ గా ఉండేది.

# మెగా ప్రిన్సెస్‌కి టాలీవుడ్ ముద్దుగుమ్మల స్పెషల్ పార్టీ...!



మెగా డాటర్ నిహారిక కొణిదెల వివాహం త్వరలో జరగనుందనే విషయం తెలిసిందే. గుంటూరు ఐజీ జొన్నలగడ్డ ప్రభాకర్ రావు తనయుడు జొన్నలగడ్డ వెంకట చైతన్యతో నిహారిక పెళ్లి నిశ్చయమైంది. ఇటీవలే నిహారిక - చైతన్యల నిశ్చితార్థం ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగింది. డిసెంబర్ లో మెగా ఫ్యామిలీలో పెళ్లి భాజాలు మోగనున్నాయి. వరుణ్ తేజ్ ప్రస్తుతం డెస్టినేషన్ వెడ్డింగ్ కి సంబంధించిన ఏర్పాట్లను చూసుకుంటున్నారు. పెళ్లి నేపథ్యంలో ఇటీవలే నిహారిక తన స్నేహితులతో కలిసి గోవాలో బ్యాచిలరేట్ పార్టీ చేసుకున్నారు. ఆ పార్టీకి సంబంధించిన ఫొటోలు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తాజాగా టాలీవుడ్ హీరోయిన్లు లావణ్య త్రిపాఠి - రీతూ వర్మలు కలిసి కాబోయే వధువు నిహారికకు స్పెషల్ పార్టీ ఇచ్చారు. ఈ విషయాన్ని నిహారిక తన సోషల్ మీడియా మాధ్యమాలలో వెల్లడించిన నిహారిక 'నేను అస్సలు ఊహించలేదు. చాలా బావుంది. లవ్ యు లావణ్య -రీతూ - అనితా రెడ్డి' అని పోస్ట్ పెట్టింది. దీనికి సంబంధించిన ఫోటోలను కూడా పంచుకుంది. ఈ ఫోటోలలో లావణ్య - రీతూలతో కలిసి మెగా ప్రిన్సెస్ ఎంజాయ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. లావణ్య త్రిపాఠి కూడా ఈ ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేశారు.

# నీ సాయం అంతా ఫేక్.. నెటిజన్ ట్రోలింగ్.. సోనూ ఇచ్చిన సమాధానం ఇదే!



కరోనా కాలం వెండితెర విలన్ ని రియల్ హీరోగా మార్చింది. ప్రజారవాణా వ్యవస్థలను ఆగిపోవడంతో దేశంలో వలస కూలీలంతా తమ సొంతూర్లకు చేరడానికి ఎన్ని అవస్థలు పడ్డారో తెలిసిందే. రోజుల తరబడి రహదారులపై నడుస్తూ తినడానికి తిండి లేక పడుకోడానికి షెల్టర్ లేక అల్లాడిపోయారు. అప్పుడు వచ్చాడు దేవుడిలా సోనుసూద్. రూ.కోట్లు ఖర్చు పెట్టి బస్సులు రైళ్లు విమానాలు బుక్ చేసి వలస కూలీలను వారి వారి గ్రామాలకు తరలించాడు. వేలాది మందికి తిండిపెట్టి హీరోగా మారాడు. అయితే ఎన్ని మంచి పనులు చేసినా ఎవరో ఒకరు విమర్శించడం మామూలే.. అలా విమర్శించిన రిషి భగ్రీ అనే నెటిజన్ కి సోనుసూద్ దిమ్మతిరిగే సమాధానం ఇచ్చాడు. " ట్విట్టర్లో కనీసం ఇద్దరు ముగ్గురు ఫాలో వర్లు కూడా లేని వ్యక్తి వైద్యానికి సాయం చేయాలంటూ ట్వీట్ చేశాడు. కనీసం సోనూ కు ట్యాగ్ చేయలేదు. లొకేషన్ చెప్పలేదు. ఏ డీటెయిల్స్ ఇవ్వలేదు. అయినా కానీ అతడికి సోనూ రిప్లై ఇచ్చాడు. ఇదెలా సాధ్యమో తెలియడం లేదు. అలాగే సోనూ టీం గతంలో సాయం కావాలంటూ వచ్చిన ట్వీట్ లను డిలీట్ చేసింది' అని కామెంట్ చేశాడు. ఈ కామెంట్ కి సోనూ సూద్ స్పందించాడు.ఇబ్బందుల్లో ఉన్న వారిని నేను ఎక్కడున్నా గుర్తిస్తా. వారు నన్ను ఆశ్రయిస్తారు..నేను కనుగొంటా . ఇవి నీకు అర్థం కావులే..రేపు పిల్లాడు ఆసుపత్రిలో ఉంటాడు. నీకు సాయం చేయాలనిపిస్తే చేయి. అతడికి కొన్ని పండ్లు పంపు. 2-3 ఫాలోవర్లు ఉన్న వ్యక్తి సంతోషిస్తాడు' అని కామెంట్ పెట్టారు. ఈ సందర్భంగా సోనూసూద్ రోగి వివరాలను కూడా షేర్ చేశారు.

# యంగ్ టైగర్‌తో కంటే ముందు ఎనర్జిటిక్ స్టార్ తో..!



అల వైకుంఠపురంలో సినిమాతో బ్లాక్ బస్టర్ ఇండస్ట్రీ హిట్ ను దక్కించుకున్న మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ తన తదుపరి సినిమాను ఎన్టీఆర్ హీరోగా ప్రకటించాడు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే ఎన్టీఆర్.. త్రివిక్రమ్ ల కాంబో మూవీ ఇప్పటికే పట్టాలెక్కాల్సి ఉంది. కాని కరోనా కారణంగా మొత్తం ప్లాన్ రివర్స్ అయ్యింది. ఎన్టీఆర్ పూర్తి చేయాల్సిన ఆర్ఆర్ ఆర్ మూవీ ఇంకా పూర్తి అవ్వలేదు. వచ్చే ఏడాది సమ్మర్ వరకు ఎన్టీఆర్ ఖాళీ అయ్యే అవకాశాలు కనిపిండం లేదు అంటూ మీడియా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అందుకే త్రివిక్రమ్ ఈ గ్యాప్ లో మరో సినిమాను చేసేందుకు రెడీ అవుతున్నాడట. టాలీవుడ్ వర్గాలు మరియు మీడియా సర్కిల్స్ నుండి అందుతున్న సమాచారం ప్రకారం ఎనర్జిటిక్ స్టార్ రామ్ కోసం త్రివిక్రమ్ కథ రెడీ చేశాడట. ఇటీవలే ఆ కథను కూడా రామ్ కు వినిపించాడట. ఆ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన అతి త్వరలోనే హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నుండి రాబోతున్నట్లుగా ఒక పీఆర్ఓ అనధికారికంగా చెప్పాడు. వీరిద్దరి కాంబో మూవీ అంటే ఖచ్చితంగా పైసా వసూల్ అన్నట్లుగా ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం యంగ్ స్టార్ హీరోలు ఎవరు ఖాళీ లేని కారణంగా రామ్ తో త్రివిక్రమ్ రెడీ అయ్యాడు అనేది కూడా ఒక పుకారు. అన్ని పుకార్లకు త్వరలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# కాబోయే వాడితో కాజల్ మొదటి ఫొటో గ్లింప్స్



చందమామ కాజల్ సడెన్ పెళ్లి ప్రకటన అభిమానులను షాక్ కి గురి చేసిన సంగతి తెలిసిందే. కాజల్- తాను వలచిన బిజినెస్ మ్యాన్ గౌతమ్ కిచ్లుని అక్టోబర్ 30 న వివాహం చేసుకోనున్నానని ప్రకటించారు. ఇప్పటికే వరుడు గౌతమ్ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. అయితే జంటగా క్లారిటీతో ఉన్న ఫోటో ఇంతవరకూ ఒక్కటీ అంతర్జాలంలో వైరల్ కాలేదు. ఆలోటును తీరుస్తూ ఇదిగో లేటెస్టుగా కాజల్ తనకు కాబోయే వాడితో ఇలా ఫోటో దిగింది. కాజల్ అగర్వాల్ కాబోయే గౌతమ్ కిచ్లుతో కలిసి దసరా సందర్భంగా అభిమానులను కోరుకుంటున్నట్లు అదిరిపోయే ఫోటోల్ని షేర్ చేసారు. ఈ జంట అక్టోబర్ 30 న ముంబైలో ప్రైవేట్ కార్యక్రమంలో డీసెంట్‌గా వివాహం చేసుకోనున్నారు. ఇప్పటికే పెళ్లి ఏర్పాట్లలో ఇరు కుటుంబాలు ప్రిపేర్డ్ గా ఉన్నాయిట. ఇక ఈ జంట ఇదివరకూ పెళ్లి తేదీని ప్రకటించినప్పటి నుండి కాజల్ కాబోయేవాడితో కలిసి ఉన్న ఫోటోల్ని పంచుకోవడం ఇదే మొదటిసారి. తాజా ఫోటోకి కాజల్ ఆసక్తికర వ్యాఖ్యను జోడించారు. "మా నుండి మీకు దసరా శుభాకాంక్షలు! గౌతమ్ కిచ్లుచ కాజ్ గౌత్ కిచ్డ్.." అంటూ ఫన్నీ కామెంట్ ని జోడించింది. ఈ ఫోటోలో కాజల్ - గౌతమ్ జంట ఆనందంగా చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నారు. కాబోయే సఖిని నడుము చుట్టూ చుట్టేశాడు గౌతమ్. గౌతమ్ ఒక వ్యాపారవేత్త.. ఇంటీరియర్ డిజైన్ ... గృహాలంకరణ వస్త్రోత్పత్తి వ్యాపారంలో అనుభవజ్ఞుడు. దీనికోసం ఇ-కామర్స్ ప్లాట్ ఫామ్ ను రన్ చేస్తున్నాడు. అతను ఫిట్నెస్ ఔత్సాహికుడు కూడా. తరచూ తాను మారథాన్ లతోనూ సుపరిచితుడు. వాటికి సంబంధించిన ఫోటోలను పంచుకుంటాడు.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989